

రంజాన్ వేళలు

	ఇఫ్తార్(సోమవారం)	సెహరీ(మంగళవారం)
కర్నూలు	6:37 (సాయంత్రం)	4:44 (ఉదయం)
ఎమ్మిగనూరు	6:34 (సాయంత్రం)	4:57 (ఉదయం)
ఆదోని	6:38 (సాయంత్రం)	4:43 (ఉదయం)



మద్దికెర ఎంపీడీఓకు మూకుమ్మడి రాజీనామా పత్రాలు అందజేస్తున్న వలంటీర్లు



వైసీపీ కుట్రలో సమిధలు..!

- రాజీనామా చేయాలని వలంటీర్లపై వైసీపీ ఒత్తిడి
- ససేమిరా అంటున్న మెజార్టీ వలంటీర్లు
- జిల్లాలో 288 మందికిపైగా రాజీనామా
- విధుల నుంచి 26 మంది తొలగింపు
- ఎన్నికల విధులకు దూరం పెట్టిన ఈసీ
- కార్యకర్తలుగా వాడుకోవాలని అధికార పార్టీ వ్యూహం

కర్నూలు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): 'మీకు ఉద్యోగాలు ఇచ్చింది మేమే.. ఎన్నికల్లో ఉపయోగపడతారు అనుకుంటే ఈసీ అడ్డుకట్ట వేసింది.. రాజీనామా చేసి ప్రచారంలో పాల్గొనండి...' అధికార వైసీపీ నాయకులు వలంటీర్లపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నారు. ఉన్నత చదువులు చదివినా గత్యంతరం లేక వలంటీర్లుగా పని చేస్తున్నాం.. వైసీపీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి రాజకీయ రంగు వేసుకుంటే మా భవిషత్తు ప్రశ్నార్థకం కాదా..? అంటూ మరోవైపు పలువురు వలంటీర్లు ఆందోళన చెందుతున్నారు. యువత భవిషత్తుతో మాకేంటి? .. మాకు ఓట్లే ముఖ్యం.. రాజీనామా చేసి ప్రచారం చేయాల్సిందే అంటూ అధికార పార్టీ నేతలు వలంటీర్లపై ఒత్తిడి తెస్తున్నారు. పత్తికొండ నియోజకవర్గంలోనే 166 మందికిపైగా రాజీనామా చేశారంటే వారిపై ఒత్తిడి ఏ స్థాయిలో ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. జిల్లాలో సుమారు 288 మందికి పైగా రాజీనామా చేశారు. మొత్తం మీద ఓట్లాటలో వలంటీర్లను సమిధలు చేస్తారా..? అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. రాజీనామా చేసిన వలంటీర్లను పోలింగ్ రోజు రాజకీయ పార్టీ ఏజెంట్లుగా కూర్చోకుండా అడ్డుకట్ట వేయాలని టీడీపీ డిమాండ్ చేస్తోంది.



వెల్దుర్తిలో మూకుమ్మడి రాజీనామా చేసిన వలంటీర్లు

26 మందిపై వేటు

సార్వత్రిక ఎన్నికల షెడ్యూలు విడుదల చేసిన రోజు నుంచే కోడ్ అమల్లోకి వచ్చింది. ఆ రోజు నుంచి ప్రభుత్వ ఖజానా నుంచి వేతనం, గౌరవ వేతనంతో పని చేసే ఉద్యోగులు, కాంట్రాక్ట్ సిబ్బంది, వలంటీర్లు ఎవరు కూడా రాజకీయ పార్టీల ప్రచారంలోనూ, రాజకీయ నాయకుల పర్యటనలోనూ పాల్గొనరాదు. కోడ్‌ను దిక్కరించి పలువురు వలంటీర్లు యథేచ్ఛగా వైసీపీ నాయకుల ర్యాలీలు, ఊరేగింపులు, కరపత్రాలు విడుదల వంటి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఫొటోలతో సహా సీ-విజిల్ యాప్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. విచారణ చేయించిన జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ జి.సృజన 26 మందిని విధుల నుంచి తప్పించారు. వారిలో అత్యధికంగా ఎమ్మిగనూరు, పాణ్యం నియోజకవర్గం వలంటీర్లే ఉన్నారు. దీంతో వైసీపీ నాయకులు రాజీనామాల కుట్రకు సై అంటున్నారు.

జిల్లాలో 25 మండలాలు సహా కర్నూలు కార్పొరేషన్, ఆదోని, ఎమ్మిగనూరు, గూడూరు మున్సిపాలిటీల్లో 1,090 గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయి. వాటి పరిధిలో 10,150 మంది ఉన్నారు. వైసీపీ నాయకులు తమ రాజకీయ కుట్రలో భాగంగా వలంటీర్లను సమిధలుగా వాడుకుంటున్నారు. వారి వేలితో వారి కంట్లోనే పొడుస్తున్నారు. 2019 ఎన్నికల ముందు ప్రతిపక్ష నేతగా జగన్ ఓటు వేసి గెలిపించండి.. మన ప్రభుత్వం రాగానే జనవరి ఒకటో తేదీన జాబ్ క్యాలెండరు విడుదల చేసి లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తాం అంటూ నిరుద్యోగులకు ఆశలు కల్పించారు. జగన్ మాటలు నమ్మిన నిరుద్యోగ యువత నిండా మోసపోయింది. వలంటరీ వ్యవస్థను తీసుకొచ్చి 50 ఇళ్లకు ఒకరిని నియమించారు. బీటెక్, పీజీ, వంటి ఉన్నత చదువులు చదివిన యువతను వలంటీర్ల పేరుతో పక్కదారి పట్టించారు. జాబ్ క్యాలెండరు రాకపోదా..? మా భవిష్యత్తు బాగుపడదా..? అంటూ నిరీక్షిస్తూ వలంటీర్లుగానే ఐదేళ్ల కాలం గడిపేయాల్సి వచ్చింది. మళ్లీ ఎన్నికలు రావడంతో వలంటీర్లు వైసీపీ కార్యకర్తలే అంటూ వారికి రాజకీయ రంగు పూశారు. ఎన్నికల విధులకు కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) దూరం పెట్టడంతో ఎలాగైనా వారిని ఉపయోగించుకోవాలని రాజకీయ స్వార్థంతో రాజీనామాల కుట్రకు, ఎన్నికల సమయంలో వాళ్లను మానసికంగా ఇబ్బందులకు గురి చేసే కుతంత్రాలకు తెరతీశారు.

అత్యధికంగా పత్తికొండలో..:

జిల్లాలో వైసీపీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి ఇప్పటి వరకు 288 మందికిపైగా వలంటీర్లు రాజీనామాలు చేశారు. అత్యధికంగా పత్తికొండ నియోజకవర్గం నుంచి ఒక్కటే 166 మంది మూకుమ్మడిగా రాజీనామాలు చేయడం కొసమెరుపు. వలంటీరుగా ఉద్యోగం మేమే ఇప్పించాం.. ఇప్పుడు రాజీనామా చేసి ఎన్నికల ప్రచారంలో వైసీపీ అభ్యర్థి ఎమ్మెల్యే శ్రీదేవికి అనుకూలంగా ప్రచారం చేయాలని ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. తాము చెప్పినట్లు రాజీనామాలు చేయకపోతే ఎన్నికల తరువాత వచ్చేది తమ ప్రభుత్వమే.. అప్పుడు మిమ్మల్ని తొలగించి వేరే వాళ్లకు అవకాశమిస్తాం..? అంటూ వైసీపీ నాయకులు భయపెడుతున్నారు. దీంతో చేసేది లేక ఇష్టం లేకపోయినా రాజీనామలు చేయకతప్పడం లేదని వెల్దుర్తికి చెందిన ఓ వలంటీర్ ఆవేదన వ్యక్తం చేశాడు. వెల్దుర్తి మండలంలో 96 మంది, మద్దికెరలో 70 మంది, పత్తికొండలో 16 మంది, కృష్ణగిరిలో ఆరుగురు కలిపి మొత్తం 188 మంది వలంటీర్లు రాజీనామాలు చేశారు. ఈ మూకుమ్మడి రాజీనామాల వెనుక వైసీపీ కుట్ర దాగిఉందని ప్రతిపక్ష పార్టీ నాయకులు ఆరోపిస్తున్నారు. అదే క్రమంలో మంత్రాలయం నియోజకవర్గంలో కూడా వలంటీర్లపై రాజీనామా ఒత్తిళ్లు పెరిగాయి. ఆ నియోజకవర్గం టీడీపీ అభ్యర్థిగా వాల్మీకి సామాజికవర్గానికి చెందిన మాధవరం రాఘవేంద్రరెడ్డిని ఆ పార్టీ బరిలో దింపింది. మెజార్టీ వలంటీర్లు అదే సామాజికవర్గానికి చెందిన వారు ఉండడంతో వారితో బలంవంతంగా రాజీనామాలు చేయించి వైసీపీకి అనుకూలంగా ప్రచారం చేయించుకునే కుతంత్రానికి తెర తీస్తున్నారు. ముఖ్యంగా కోసిగి మండలంలో రాజీనామాలు చేయాలంటూ వలంటీర్లపై వైసీపీ ముఖ్య నాయకుడు ఒకరు తీవ్ర ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తుంది. అలాగే.. పాణ్యం నియోజకవర్గంలో కూడా ఇదే తీరుకు ఉంది. అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లతో ఓర్వకల్లు మండలంలో 67 మంది వలంటీర్లు రాజీనామాలు చేయడం కొసమెరుపు.



పత్తికొండలో రాజీనామా చేస్తున్న వలంటీర్లు



రాజీనామా చేసిన వారిని దూరం పెట్టాలి

వలంటీర్లతో బలవంతంగా రాజీనామా చేయించి తమకు అనుకూలంగా ప్రచారం చేయించుకునే కుట్రకు వైసీపీ నాయకులు తెర తీశారు. వారు రాజీనామా చేసినప్పటికీ ప్రచారంలో పాల్గొనకుండా, ఏజెంట్లుగా కూర్చోకుండా కట్టడి చేయాలి. ఈ విషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం. ఓడిపోతామనే భయంతో వైసీపీ రాజకీయ కుట్రలకు పాల్పడుతోంది.

- బీటీ నాయుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు, కర్నూలు

గద్వాల టు ప్రొద్దుటూరు

- పంచలింగాలలో భారీ లిక్కర్ మాఫియాకు చెక్
- రూ. 14. 50 లక్షల మద్యం, వాహనం సీజ్
- ఎర్రచందనం స్మగ్లర్ కీలక సూత్రధారి
- 8 మంది సిబ్బందికి రివార్డులు ప్రకటించిన ఎస్పీ
- లోతైన పరిశీలన చేస్తున్నాం- సెబ్ ఈఎస్

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 7: తెలంగాణ రాష్ట్రంలోని గద్వాల జిల్లా నుంచి కడప జిల్లా ప్రొద్దుటూరు, మైదుకూరుకు అక్రమంగా మద్యం తరలిస్తున్న ముఠాను స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో గుట్టు రట్టు చేసింది. ఆదివారం కర్నూలు సెబ్ కార్యాలయంలో ఏఈఎస్ వినోద్‌కుమార్, సీఐ రాజేంద్ర ప్రసాద్‌లతో కలిసి సెబ్ సూపరింటెండెంట్ రవికుమార్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వెల్లడించారు. పంచలింగాల చెక్ పోస్టు వద్ద ఎస్ఐ పృథ్వీరాజ్ చాకచక్యంతో వాహనాన్ని పరిశీలించగా విషయం వెలుగులోకి వచ్చిందన్నారు. కడప జిల్లాకు చెందిన ఎర్రచందనం స్మగ్లర్ చింపర్తి రింగుల బాషా అనే వ్యక్తి అశోక్ లైలాండ్ వాహనంలో 240 విస్కీ బాటిళ్ల బాక్స్‌లు వరి పొట్టుతో లోడ్ చేసి కనిపించకుండా తరలించే ప్రయత్నం చేశాని తెలిపారు. దాదాపు 11,520 బాటిళ్లలో 2,073 లీటర్ల మద్యం తరలిస్తున్నట్లు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. డ్రైవర్ పటాన్ సాధిక్ ఇచ్చిన సమాచారం మేరకు రింగుల బాషాను అదుపులోకి తీసుకొని విచారించామన్నారు. గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం జింకలపల్లెకు చెందిన శ్రీనివాస వైన్స్ యాజమాన్యం ఐఎంఎల్ డిపో నుంచి 614 డీఎంకే విస్కీ బాటిళ్లు తీసుకోగా అందులో 240 బాటిళ్లను కడప జిల్లాకు తరలిస్తున్నట్లు అంగీకరించాడని తెలిపారు. వీటి విలువ రూ.14,51,520 ఉంటుందని, వాహనం విలువ రూ 4 లక్షలు ఉంటుందని తెలిపారు. కడప జిల్లా చాపాడు మండలం, పల్లవోలు గ్రామానికి చెందిన చింపర్తి రింగుల బాషా, షేక్ షఫీ, కందనూరు హబీబుల్లా, పటాన్ సాధిక్‌లపై కూడా కేసు నమోదు చేశామని తెలిపారు. ఈ అక్రమ రవాణాను వెలుగులోకి తెచ్చిన 8 మంది సిబ్బందికి ఎస్పీ క్రిష్ణకాంత్ రివార్డులు ప్రకటించారు. కేసు నమోదు చేసి ఎస్పీ ఆదేశాల మేరకు లోతుగా పరిశీలన చేస్తున్నామని తెలిపారు.



పట్టుబడిన తెలంగాణ మద్యాన్ని చూపుతున్న సెబ్ పోలీసులు

వైద్య వృత్తిని కాపాడుకోవాలి

- ఆరోగ్యానికి ఐదు శాతం నిధులు ఇవ్వాలి
- ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డా.ఎం. జయచంద్ర నాయుడు

కర్నూలు(హాస్పిటల్), ఏప్రిల్ 7: వైద్య వృత్తిని కాపాడుకోవాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) రాష్ట్ర అధ్యక్షుడు డా.ఎం.జయచంద్రనాయుడు అన్నారు. ఆదివారం సాయంత్రం నగరంలోని ఐఎంఏ భవన్‌లో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ స్థాయిలో రూపొందించిన హెల్త్ మేనిఫెస్టోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా వైద్యులపై దాడులు జరుగుతున్నాయని, చట్టాలు ఉన్న అవి నిష్ప్రయోజనకరంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక యువ డాక్టర్ ప్రాక్టీసు చేసుకోవాలంటే 20 అనుమతులు తీసుకోవాలని, ఇది కష్టంగా మారిందని అన్నారు. దీన్ని నిరోధించేందుకు సింగిల్ విండో రిజిస్ట్రేషన్ విధానాన్ని అమలులోనికి తేవాలని డిమాండ్ చేశారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైద్య ఆరోగ్యానికి 1.6 శాతం నుంచి 1.6 శాతం మాత్రమే నిధులు కేటాయిస్తున్నాయని, దీన్ని ఐదు శాతానికి పెంచాలని కోరారు. జూనియర్ డాక్టర్లు, ఏపీజీడీఏ వైద్య విద్యార్థులను ఒకే పరిధిలోకి తెచ్చి ఐఎంఏను బలోపేతం చేస్తామని అన్నారు. అలాగే డాక్టర్ల తరఫున ఎమ్మెల్సీ ఇవ్వాలని, ప్రజలకు నమ్మకం కలిగించేలా ప్రభుత్వం వైద్య రంగాన్ని పటిష్టం చేయాలన్నారు. అనంతరం ఐఎంఏ కర్నూలు బ్రాంచ్ అధ్యక్షునిగా డా.రామచంద్రనాయుడు కార్యదర్శిగా డా.ఎస్వీ రామ్మోహన్ రెడ్డి, కోశాధికారిగా డా.మాధవీ శ్యామల చేత రాష్ట్ర అధ్యక్షులు ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర యాక్షన్ కమిటీ అధ్యక్షులు డా.జి.బాలమద్దయ్య, రాష్ట్ర మాజీ అధ్యక్షులు డా.రవికృష్ణ, ఆప్నా జిల్లా అధ్యక్షుడు డా.త్రినాథ్, ఐఎంఏ కర్నూలు శాఖ అధ్యక్ష, కార్యదర్శులు డా.రామచంద్రనాయుడు డా.ఎస్వీ రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.



సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డా. జయచంద్ర నాయుడు

కైలాస వాహనంపై శ్రీశైలేశుడు





భక్తుల విన్యాసాలు



మహిళల కోలాటం



శ్రీశైలం, ఏప్రిల్ 7: ఇల కైలాసంగా వెలుగొందుతున్న శ్రీశైలం మహాక్షేత్రంలో ఉగాది మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు ఆదివారం భ్రమరాంబ సమేత మల్లికార్జునుడు కైలాస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. భ్రమరాంబికాదేవిని మహాదుర్గగా అలంకరించారు. ఉత్సవానికి ముందుగా ఉభయ దేవాలయ ప్రాంగాణంలోని అలంకార మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను సుగంధ పుష్పాలతో ముస్తాబైన కైలాస వాహనంపై అధిష్టింపజేశారు. ఆలయ ప్రధాన అర్చకులు, వేదపండితులు అర్చనలు, హారతి పూజలు జరిపారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను మంగళ వాయిద్యాలు, కళాకారుల సంగీత, జానపద నృత్యాల నడుమ ఆలయం రాజగోపురం నుంచి వెలుపలకి తోడ్కొనివచ్చి, గంగాధర మండపం వద్ద ప్రత్యేక పూజాధికాలను నిర్వహించి క్షేత్ర పురవీధుల్లో గ్రామోత్సవం జరిపారు. గ్రామోత్సవంలో అశేషంగా భక్తులు పాల్గొన్నారు. గ్రామోత్సవం ముంగిట కోలాటం, చక్కభజన, రాజభటుల వేషాలు, జాంజ్ పథక్, జానపద పగటి వేషాలు, గొరవయ్యలు, బుట్టబొమ్మల నృత్యాలు, బీరప్పడోలు, తప్పెట్లు, డ్రమ్స్, భజంత్రీలు, శంఖానాదాలు మార్మోగాయి. ఆలయ రాజగోపురం నుంచి ప్రారంభమైన గ్రామోత్సవం గంగాధర మండపం మీదుగా నంది మండపం వరకు తిరిగి అక్కడి నుంచి బయలు వీరభద్రస్వామి ఆలయం దాకా కొనసాగింది. కైలాస వాహనంపై దర్శినమిచ్చిన భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను భక్తులు కనులారా దర్శించుకున్నారు. గ్రామోత్సవంలో దేవస్థానం అధికారులు, సిబ్బంది, వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

నేడు ప్రభోత్సవం, అమ్మవారికి మహా సరస్వతి అలంకారం

ఉగాది మహోత్సవాల్లో భాగంగా మూడో రోజు సోమవారం సాయంత్రం ఆదిదేవులకు ప్రభోత్సవం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. రాత్రి స్వామి, అమ్మవార్లకు నంది వాహన సేవ, మహా సరస్వతి అలంకారంలో అమ్మవారు దర్శనం ఇవ్వనున్నారు. గ్రామోత్సవం నిర్వహించనున్నారు. రాత్రి 10 గంటలకు వీరాచార్య విన్యాసాలు, అగ్నిగుండ ప్రవేశం కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

- మహా దుర్గగా అమ్మవారి దర్శనం
- వైభవంగా గ్రామోత్సవం
- ఆది దంపతులను చూసి పరవశించిన భక్తులు
- నేడు ప్రభోత్సవం, నంది వాహన సేవ
- అమ్మవారికి మహాసరస్వతి అలంకారం



శ్రీశైలంలో కిక్కిరిసిన భక్తులు



భక్తుల వేషధారణలు



పోలింగ్‌లో ఈవీఎంలు

నంద్యాల జిల్లాలో 1621 పోలింగ్ కేంద్రాల్లో 3890 ఈవీఎంలు ఏర్పాటు: రానున్న సార్వత్రిక ఎన్నికల సంబంధించి నంద్యాల జిల్లాలో మొత్తం 1621 పోలింగ్ కేంద్రాల్లో సుమారు 3890 ఈవీఎంలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిసింది. జిల్లాలోని ఆళ్లగడ్డలో 395, శ్రీశైలంలో 226, నందికొట్కూరులో 251, నంద్యాలలో 281, బనగానపల్లిలో 277, డోన్‌లో 291 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ప్రతి పోలింగ్ కేంద్రంలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి విడివిడిగా ఈవీఎంలను ఏర్పాటు చేస్తారు. ఈ లెక్కన జిల్లాలోని మొత్తం 1621 పోలింగ్ కేంద్రాలకు గాను 3242 ఈవీఎంలను ఏర్పాటు చేయాల్సి వుంటుంది. అయితే పోలింగ్ రోజున ఈవీఎంలు సాంకేతిక లోపం, ఇతర ఏదైనా సమస్యతో మొరాయించే అవకాశం ఉండటంతో ఆయా నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాల సంఖ్యను పరిగణలోకి తీసుకుని అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు అదనంగా 20శాతం ఈవీఎంలను అందుబాటులో ఉంచుతారు. ఈ లెక్కన ప్రస్తుతం మన నంద్యాల జిల్లాలో 3890 ఈవీఎంలను ఎన్నికల అధికారులు సిద్ధం చేసినట్లు అధికారిక గణాంకాల ద్వారా తెలుస్తోంది.

- ఈ విధానంలో చెల్లని ఓట్లు ఉండవు
- ఓట్ల లెక్కింపు సులభతరం
- నంద్యాల ఉప ఎన్నికలో తొలిసారిగా వీవీప్యాడ్స్ వినియోగం
- జిల్లాలో 1621 పోలింగ్ కేంద్రాల్లో 3890 ఈవీఎంల ఏర్పాటు

ఆత్మకూరు, ఏప్రిల్ 7:

ఒకప్పుడు ఎన్నికల్లో బ్యాలెట్ పత్రాలు కీలకం. బ్యాలెట్ పత్రంలో అభ్యర్థులకు ఎన్నికల కమిషన్ కేటాయించిన గుర్తుపై ఓటు వేసేవారు. ఎవరికి ఎక్కువ ఓట్లు వచ్చిందీ లెక్కించేవారు. దాని ప్రకారం గెలుపు ఓటములు నిర్ణయించేవారు. అయితే బ్యాలెట్ పత్రాల వినియోగంలో పలు లోపాల వల్ల అభ్యర్థుల విజయాలు సైతం తారుమారయ్యేవి. దీనికి చెల్లని ఓట్లు కూడా కారణం. బ్యాలెట్ పత్రంలో నిర్ణయించిన గడిలో కాకుండా రెండు గడుల్లో గుర్తుపడేలా కొందరు ఓటర్లు ఇంకుతో స్వస్తిక్ ముద్ర వేసేవారు. మరికొందరు బ్యాలెట్ పత్రంలో వేసిన స్వస్తిక్ గుర్తు ఇంకు మరో అభ్యర్థి పేరు మీద అంటేలా మడిచేవారు. అట్లాగే బ్యాలెట్ పేపర్లు చినిగిపోయినవాటిని, గుర్తు సక్రమంగా పడని వాటిని చెల్లని ఓట్లుగా ఎన్నికల అధికారులు నిర్ధారించేవారు. అయితే ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎం) అందుబాటులోకి రావడంతో చెల్లని ఓట్లకు అవకాశం లేదు. ఈవీఎంలలో అభ్యర్థుల పేరు, పార్టీ గుర్తుతో పాటు అభ్యర్థుల ఫొటోలను కూడా పొందుపరుస్తున్నారు. ఈవీఎంల పనితీరులో భాగంగా బ్యాలెట్ యూనిట్‌లో పోటీ చేయనున్న అభ్యర్థుల పేర్ల ముందు ఉన్న బటన్లలో ఏ అభ్యర్థికి అయితే ఓటు వేయాలనుకున్నామో ఆ అభ్యర్థి పేరు వద్ద బటన్ నొక్కడంతో బీప్ సౌండ్‌తో ఆ అభ్యర్థి పేరు వద్ద వున్న లైట్ వెలిగి ఓటు నమోదవుతోంది. అయితే తమ ఓటు తాము ఎంపిక చేయబడ్డ అభ్యర్థికే నమోదు అయిందో లేదో తెలుసుకునేందుకు వీవీప్యాడ్స్‌ను వినియోగిస్తున్నారు.







ఈవీఎంల వినియోగంతో ఓట్ల లెక్కింపు సులభం

ఈవీఎంలు రాకముందే ఎన్నికల్లో ఓట్ల లెక్కింపు జరిపేందుకు గంటల కొద్ది సమయం పట్టేది. చాలా మంది సిబ్బంది అవసరం వుండేది. దీనికితోడు చెల్లని ఓట్లు అభ్యర్థులు గెలుపోటములపై ప్రభావం చూపేది. కాబట్టి చెల్లని ఓట్ల గణించడం ఒక ముఖ్యమైన విషయంగా ఉండేది. అయితే ఈవీఎంల వినియోగం వల్ల ఓట్ల లెక్కింపు తక్కువ సమయంలోనే జరుగుతోంది. అంతేకాకుండా సిబ్బంది కూడా తగిన పరిమితిలో వుంటే సరిపోతోంది. ప్రత్యేకించి ఈవీఎంల వినియోగంలో ఒక్క ఓటు కూడా వృథా కాదు. దీని కోసమే ఎన్నికల కమిషన్ ఈవీఎంలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రధాన కారణమని చెప్పవచ్చు. ఇదిలావుంటే ఈవీఎంల పనితీరులో లోపాలు ఉన్నాయని, ఓ పార్టీకి ఓటు వేస్తే మరో పార్టీకి నమోదవుతోందని పలు సందర్భాల్లో ఆరోపణలు వెల్లువెత్తినప్పటికీ నిర్ధారణ కాలేదు. అయితే ఎన్నికల్లో మరింత పారదర్శక కనిపించేలా వీవీప్యాడ్స్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఈవీఎంలో నిర్ణయించిన అభ్యర్థి పేరు ఎదుట బటన్ నొక్కడానే బీప్ సౌండ్‌తో పాటు వీవీ ప్యాడ్స్‌లో అభ్యర్థికి నిర్ణయించిన నంబర్, పార్టీ గుర్తు ఓటరు 7సెకన్ల పాటు కనిపిస్తుంది. ఈ స్లిప్‌లన్నీ ఒక బాక్స్‌లో పడిపోతాయి. దీంతో ఓటరు తాను నిర్ణయించుకున్న అభ్యర్థికే తన నమోదైన విషయాన్ని నిర్ధారించుకుంటారు. అయితే బ్యాలెట్ యూనిట్‌లోని ఓట్ల లెక్కింపులో ఏదైనా అనుమానాలు వుంటే వీవీప్యాడ్ యూనిట్‌లోని స్లిప్‌లను లెక్కించి అనుమానాలను నివృత్తి చేసుకునే వెసులుబాటు కల్పించారు. కాగా మన జిల్లాలో 2017లో నంద్యాలలో జరిగిన ఉప ఎన్నికల్లో తొలిసారిగా వీవీప్యాడ్స్‌ను ఉపయోగించడం గమనార్హం.

ఈవీఎంలపై మరింత సమాచారం

దేశంలో 1952 నుంచి ఎన్నికల విధానం అమల్లోకి వచ్చింది. సుమారు మూడు దశాబ్దాలు బ్యాలెట్ బాక్స్‌లో ఓట్లు వేసేవారు. బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు, స్వస్తిక్ గుర్తులను ఎన్నికల్లో వినియోగించేవారు. ఇప్పుడు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ (ఈవీఎం)లను అందుబాటులోకి తెచ్చారు. అయితే 42ఏళ్ల కిందటే దేశంలో ఈవీఎంలను అందుబాటులోకి తెచ్చారు. మొదటిసారిగా 1982లో కేరళలోని పరూర్ నియోజకవర్గంలో ఈవీఎంలను ఉపయోగించారు. 1982 నుంచి 1983 వరకు వివిధ ఉప ఎన్నికల్లో ఈవీఎంలను వినియోగించారు. 1984లో ఈవీఎంలపై ఫిర్యాదులు రావడంతో సుప్రీంకోర్టు వాటిని ఉపయోగించరాదని ఆదేశించింది. 1990లో ఈవీఎంలలోని సాంకేతిక లోపాలను సరిదిద్దేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటైంది. 1998 నుంచి ఈవీఎంల వాడకం మళ్లీ మొదలైంది. అయితే ఈవీఎంల పనితీరుపై వెల్లువెత్తిన ఆరోపణలతో మరింత పారదర్శకతను పాటించేలా ఈవీఎంలలో వీవీప్యాడ్స్‌ను వినియోగిస్తున్నారు. ఏది ఏమైనా ఈవీఎంల వాడకంతో విలువైన ఓట్లు వృథా కాదు. ఇది ప్రజాస్వామ్యానికి మరింత బలం చేకూరుస్తున్నదని చెప్పవచ్చు.

స్ట్రాంగ్ రూం కేంద్రాల పరిశీలన


అధికారులతో మాట్లాడుతున్న జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 7: రాయలసీమ యూనివర్సిటీలోని స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ హాల్, రిసెప్షన్ సెంటర్లను, పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజిలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను ఆదివారం జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మౌర్య మాట్లాడుతూ రాయలసీమ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ బ్లాక్‌లో పాణ్యం నియోజకవర్గానికి సంబంధించి స్ట్రాంగ్ రూమ్స్, కౌంటింగ్ హాల్స్, రిసెప్షన్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని అన్నారు. పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీలో పాణ్యం నియోజకవర్గానికి సంబంధించి డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని అన్నారు. యూనివర్సిటీ ఆవరణ చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి పార్కింగ్ కోసం ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల సిబ్బందికి తాగునీరు, భోజన సదుపాయం, బాత్‌రూముల సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో కల్లూరు తహసీల్దార్ మునివేలు, మున్సిపల్ ఇంజనీర్ రవిప్రకాష్ ఉన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోండి

కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు

నంద్యాల టౌన్, ఏప్రిల్ 7: సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవచ్చునని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ కె. శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారిగా కార్మిక శాఖ సహాయ కమిషనర్ బషీరున్నీసా బేగంను నియమించినట్లు తెలిపారు. నిత్యావసర సేవలందించే 33 విభాగాల సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవచ్చునని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్‌కు అర్హత ఉన్న సిబ్బంది ఫారం -12 డీ ద్వారా వివరాలను పొందుపరిచి దరఖాస్తును సంబంధిత నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులకు సమర్పించాలని కోరారు. పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు వేసేందుకు వీలు పడిన వారు పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

శ్రీశైలంలో భద్రత ఏర్పాట్లపై సమీక్ష

శ్రీశైలం, ఏప్రిల్ 7: శ్రీశైలంలో జరుగుతున్న ఉగాది మహోత్సవాల ఏర్పాట్లు, పోలీస్ భద్రతా చర్యలను ఆదివారం ఏఎస్పీ కె. ప్రవీణ్‌కుమార్ సమీక్షించారు. ఇందులో భాగంగా ఏఎస్పీ శ్రీశైల క్షేత్ర పరిధిలోని రథ వీధిని, అగ్నిగుండ ప్రవేశ ప్రాంగణం, పార్కింగ్ తదితర ప్రదేశాలలో పర్యటించి భద్రత, ట్రాఫిక్ నిర్వహణపై పోలీస్ సిబ్బందికి తగు సూచనలు చేశారు. క్షేత్ర పర్యటనకు ముందుగా భ్రమరాంబ అతిథి గృహం నందు ఉగాది మహోత్సవాల ఏర్పాట్ల సమీక్షలో ఏఎస్పీ కె. ప్రవీణకుమార్, ఆలయ కార్యనిర్వహణాధికారి డి. పెద్దిరాజు, ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు, దేవస్థానం ఇంజనీరింగ్ అధకారులు, ఆలయ భద్రతా విభాగం అధికారులు, స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్, సబ్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ ప్రభోత్సవం, రథోత్సవం జరిగే సమయంలో ఎలాంటి తొక్కిసలాటలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే సోమవారం రాత్రి శివదీక్షా శిబిరాలలో జరిగే అగ్నిగుండ ప్రవేశం, వీరచార విన్యాసాల కార్యక్రమాలకు కన్నడ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారన్నారు. అలాగే వైద్యసేవలు, అగ్రిమాపక వాహనాన్ని అందుబాటులో ఉంచుకోవాలని, భక్తులు అగ్ని గుండంలోనికి ప్రవేశించకుండా చుట్టూ పటిష్టమైన కంచె ఏర్పాటు చేయాలన్నారు. అగ్ని గుండ ప్రవేశం, వీరచార విన్యాసాల కార్యక్రమాలను భక్తులందరూ వీక్షించే విధంగా గంతంలో వలె ఎల్ఈడీ స్క్రీన్లలో ప్రసారం చేయాలన్నారు. ఉత్సవాలు పూర్తి అయ్యేవరకు కమాండ్ కంట్రోల్ రూము నందు విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అదేశించారు.


మాట్లాడుతున్న ఏఎస్పీ, పాల్గొన్న అధికారులు

డ్రగ్ డీలర్స్ అసోసియేషన్‌కు ఎన్నికలు

అధ్యక్షుడిగా వై.పుల్లయ్య, కార్యదర్శిగా ఎం.శ్రీధర్

కర్నూలు(హాస్పిటల్), ఏప్రిల్ 7: కెమిస్ట్ భవన్‌లో ఆదివారం కర్నూలు జిల్లా మొట్టమొదటి డ్రగ్ డీలర్స్ అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. ఎన్నికల పరిశీలకులుగా కడప జిల్లాకు చెందిన అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు టి.నరసింహమూర్తి, టి.వెంకటేశ్వర్లు, శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షులు శివకుమార్‌గా వ్యవహరించారు. జిల్లా వ్యాప్తంగా 894 మంది సభ్యులుగా ఉన్న అసోసియేషన్‌కు కార్యదర్శిగా ఉన్న వై.పుల్లయ్య (కర్నూలు), జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



డ్రగ్ డీలర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గంతో ఎన్నికల పరిశీలకులు

టీడీపీలో చేరిన సీపీఎం కార్యకర్తలు

కర్నూలు(కల్చరల్), ఏప్రిల్ 7: కర్నూలు రూరల్ మండలం ఇ-తాండ్రపాడుకు చెందిన సుమారు 200 మందికి పైగా సీపీఎం కార్యకర్తలు టీడీపీ కోడుమూరు మాజీ ఇన్‌ఛార్జి విష్ణువర్ధన్‌రెడ్డి, కర్నూలు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి పంచలింగాల బస్తిపాటి నాగరాజు, కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి బొగ్గుల దస్తగిరి సమక్షంలో ఆదివారం టీడీపీలో చేరారు. పసుపు కండువాలు వేసి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. స్థానిక టీడీపీ నాయకుడు శేషన్న ఆధ్వర్యంలో సీపీఎం సీనియర్ నాయకుడు మునిస్వామి, తిరుమలేష్, వెంకన్న, తిరుపాల్, గరీబ్‌బాషా తదితరులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి పంచలింగాల నాగరాజు మాట్లాడుతూ రాబోయేది టీడీపీ - జనసేన - బీజేపీ కూటమి ఎన్డీయే ప్రభుత్వమేనని అన్నారు.


సీపీఎం నాయకులను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి, పంచలింగాల నాగరాజు

డోన్‌లో కొండముచ్చు హల్చల్

ఐదుగురికి గాయాలు

డోన్(రూరల్), ఏప్రిల్ 7: పట్టణంలో కొండముచ్చు కోతి ఆదివారం హల్చల్ చేసింది. పట్టణంలోని పాతపేట ప్రాంతంలో చిన్నారులు, వృద్ధులపై దాడి చేయడంతో ఐదుగురు గాయాలతో ఆసుపత్రుల పాలయ్యారు. అలాగే పట్టణంలోని పలు ప్రదేశాల్లో కూడా కొండముచ్చు దాడికి గురై ఆసుపత్రికి చేరిన కేసులు పది దాకా వచ్చాయని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. పట్టణంలోని పాతపేటకు చెందిన చిన్నారులు హరీష్, చక్రధర్, ఆదర్శ కుమార్, వృద్ధులు నారాయణ, పార్థసారథి తదితరులు కొండముచ్చు దాడిలో గాయపడిన వారిలో ఉన్నారు. కొండముచ్చుల బెడద అధికమైందని, అటవీ అధికారులు వాటిని పట్టుకుని అటవి ప్రాంతాల్లోకి వదిలివేయాలని టీడీపీ పట్టణ యువ నాయకుడు హనుమంతరెడ్డి కోరారు.

వడదెబ్బతో కన్నడ భక్తురాలు మృతి

ఆత్మకూరు రూరల్, ఏప్రిల్ 7: ఆత్మకూరు మండలంలోని నాగలూటి వీరభద్రాలయం ప్రాంతంలో ఇందిరాబాయి (37) అనే కన్నడ భక్తురాలు వడదెబ్బ సోకి మృతి చెందింది. వివరాల్లోకి వెళితే.. కర్ణాటక రాష్ట్రం బీజాపూర్ జిల్లా వాసి అయిన ఇందిరాబాయి పది రోజుల నుంచి కాలినడకన శ్రీశైలానికి ప్రయాణం సాగించింది. అయితే వెంకటాపురం గ్రామం నుంచి నాగలూటి వీరభద్రాలయం చేరుకొని అక్కడ ఉన్న మెట్ల మార్గంలో కాలినడక మార్గంలో వడ దెబ్బసోకి ఒక్కసారిగా కుప్పకూలి పోయింది. దీంతో స్థానికులు అక్కడి వైద్యాధికారులకు సమాచారం అందించారు. హుటాహుటిన ఆమెను 108 వాహనంలో ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతురాలి వివరాలు సేకరించి వారి బంధువులకు సమాచారం అందించారు

స్కూటీపై నుంచి పడి ఉపాధ్యాయురాలు మృతి

ఆళ్లగడ్డ, ఏప్రిల్ 7: ఆళ్లగడ్డ మున్సిపాల్టీ పరిధిలోని పడకండ్ల వద్ద జరిగిన స్కూటీ ప్రమాదంలో కోవెలకుంట్లకు చెందిన ఉపాధ్యాయురాలు రాధాబాయి(28) మృతి చెందింది. భర్త హేమ్లానాయక్‌తో కలిసి అహోబిలం లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకునేందుకు స్కూటీపై వెళ్లారు. దర్శనం అనంతరం తిరిగి కోవెలకుంట్లకు ఆదివారం వెళ్తుండగా పడకండ్ల వద్ద వారు ప్రయాణించే స్కూటీ అదుపు తిప్ప కింద పడింది. ప్రమాదంలో కింద పడ్డ రాధాబాయి తలకు తీవ్ర గాయమైంది. ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే చనిపోయిందని వైద్యులు నిర్ధారించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలు రాధాబాయి కోవెలకుంట్ల మండలంలోని భీమునిపాడు మండల పరిషత్ పాఠశాలలో, భర్త హేమ్లానాయక్ ఆదోని మండలంలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. వీరికి మూడేళ్ల చిన్నారి ఉంది.

భానుడి భగభగలు

- ఉమ్మడి జిల్లాలో 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు
- రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- తీవ్ర వడగాల్పులతో జనం ఉక్కిరిబిక్కిరి



కర్నూలు(అగ్రికల్చర్), ఏప్రిల్ 7: ఉమ్మడి కర్నూలు జిల్లాలో భానుడు తన ప్రతాపాన్ని రోజురోజుకు తీవ్రతరం చేస్తుండటంతో ప్రజలు నిప్పులపై నడుస్తున్నట్లుగా ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. కర్నూలు జిల్లాలో 45 డిగ్రీల ఉష్ణోగ్రత.. నంద్యాల అదే స్థాయిలో 45 డిగ్రీల కంటే ఎక్కువ ఉష్ణోగ్రతగా ఆదివారం నమోదయ్యాయి. కర్నూలు జిల్లాలో అత్యధికంగా 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అదే విదంగా మంత్రాలయంలో 45 డిగ్రీలు, నంద్యాల జిల్లా చాగల మర్రి 45.8, బనగానపల్లెలో 45.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఈ ఉష్ణోగ్రతలు చోటు చేసుకున్న నియోజకవర్గాల్లో రాష్ట్రంలోనే కర్నూలు, నంద్యాల జిల్లాలో మొదటి స్థానంలోకి రావడం ఆందోళనలు కలిగిస్తున్నాయి. కర్నూలు జిల్లాలో గోనెగండ్లలో 41.6, గూడూరులో 42.7, హాలహర్విలో 40.4, హొళగుంద లో 42.5, కల్లూరులో 41.6, కోడుమూరులో 43.4, కోసిగిలో 41.3, కౌతాళంలో 41.6, క్రిష్ణగిరిలో 42, కర్నూలులో 42, మద్దికెరలో 41.4, నందవరంలో 41.8, ఓర్వకల్లులో 42.6, పత్తికొండలో 41.5, పెద్దకడుబూరు 40.6, తుగ్గలిలో 40.4, వెల్దుర్తిలో 41.6, ఎమ్మిగనూరులో 42, అలాగే నంద్యాల జిల్లాలో ఆళ్లగడ్డలో 43.4, ఆత్మకూరులో 43.3, బండి ఆత్మకూరులో 43.4, బేతంచెర్లలో 41.1, డొర్నిపాడులో 43.3, గడివేములలో 43.5, జూపాడుబంగ్లాలో 42.2, కోయలకుంట్లలో 43.3, కొలిమిగుండ్లలో 43, కొత్తపల్లిలో 43.1, మహానందిలో 43.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైంది.



పూడిచెర్ల యువత జనసేనలో చేరిక

కర్నూలు(న్యూసిటీ), ఏప్రిల్ 7: పాణ్యం నియోజకవర్గం ఓర్వకల్లు మండలం పూడిచెర్ల గ్రామానికి చెందిన యువత జనసేన పార్టీలో చేరారు. ఆదివారం బిర్లా కాంపౌండు పార్టీ కార్యాలయంలో ఉమ్మడి కర్నూలు జిల్లా కో ఆర్డినేటర్ చింతాసురేష్‌బాబు యువతకు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. సురేష్‌బాబు మాట్లాడుతూ ఎమ్మెల్యే అభ్యర్థి గౌరుచరితారెడ్డి గెలుపుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. టీడీపీ ప్రభుత్వంతోనే యువత అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్‌నాయకులు పీబీవి.సుబ్బయ్య, యుగంధర్, ఎల్లారెడ్డి, శివకుమార్, శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలి

కర్నూలు(న్యూసిటీ), ఏప్రిల్ 7: రానున్న పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో దుర్మార్గమైన బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.నర్సింగరావు పిలుపునిచ్చారు. ఆదివారం కార్మిక కర్షక భవన్‌లో ప్రభుత్వ విధానాలపై ట్రేడ్ యూనియన్ల వర్క్‌షాపు నిర్వహించారు. వర్క్‌షాపుకు ముఖ్యఅతిథిగా హాజరైన నర్సింగరావు మాట్లాడుతూ సుభాష్‌చంద్రబోసు, బాలగంగాధర్‌తిలక్, జ్యోతిబసు, వివిగిరి లాంటి జాతీయ నాయకులు ట్రేడ్ యూనియన్ నాయకులుగా పోరాటాలు చేసి కార్మిక చట్టాలు సాధించుకున్నారని అన్నారు. బీజేపీతో పాటు దానికి వంతపాడే పార్టీలను ఓడించి వామపార్టీల అభ్యర్థులను గెలిపించుకున్నప్పుడే కార్మిక రాజ్యం వస్తుందన్నారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమం కోసం వసూలు చేసి రూ.10వేల కోట్లు కార్మికులకు ఖర్చు చేయకుండా ఇతర సంక్షేమ పథకాలకు వాడుతోందని విమర్శించారు. ఈ వర్క్‌షాపులో జిల్లా అధ్యక్షుడు పీఎస్.రాధాక్రిష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు, నాయకులు రామాంజనేయులు, ఏ.నాగరాజు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కంప్యూటర్ పరిజ్ఞానం అవసరం



కంప్యూటర్ శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్న డా.శంకర్‌శర్మ

కర్నూలు(న్యూసిటీ), ఏప్రిల్ 7: ప్రస్తు తం ఉన్న డిజిటల్ యుగం లో కంప్యూటర్ విషయం పరిజ్ఞానం లేకుంటే భవిష్యత్తులో రాణించడం కష్టమని ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు వైద్యులు డా.శంకర్‌శర్మ అన్నారు. బ్యాగనగర్‌లోని ఫస్ట్‌స్టెప్ కంప్యూటర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆదివారం వేసవి కంప్యూటర్ శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. డా.శంకర్‌శర్మ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు వేసవి సెలవులను కంప్యూటర్ శిక్షణ ద్వారా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గత 24 సంవత్సరాలుగా ఫస్ట్‌స్టెప్ కంప్యూటర్ సెంటర్ ద్వారా ఎంతో మంది విద్యార్థులకు,ఉద్యోగులకు కంప్యూటర్ శిక్షణ ఇవ్వడంతో పాటు ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించి సంస్థ అధినేత రాజశేఖర్‌ను ఆయన అభినందించారు. కార్యక్రమంలో మేనేజర్ సుజాత, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి కుంటలకు నీరు వదలండి

సి. బెళగల్, ఏప్రిల్ 7: మండలంలోని క్రిష్ణదొడ్డి, బ్యాదోలి, బ్రాహ్మణదొడ్డి తాగునీటి కుంటలకు నీరు వదలాలని వివిధ గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ సందర్భంగా ఈ గ్రామాల ప్రజలు ఆదివారం మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మార్చి నెలలో తమకు తాగునీటి సమస్య వస్తుందని తెలిసి ఎల్లెల్సీ అధికారులు నీరు వదిలేవారని, అయితే ఈ సంవత్సరం వర్షాలు లేక పోవడంతో జనవరి నెలలోనే బోర్లు ఎండిపోయాయని అన్నారు. గత నెల చివరి వారంతో స్పందనలో అధికారులకు తాగునీటి కుంటలకు నీరు వదలాలని దరఖాస్తు చేసుకున్నప్పటికీ పట్టించుకోలేదని అన్నారు. క్రిష్ణదొడ్డి గ్రామమంలో కోన వెంకటేశ్వరస్వామి జాతర ఉన్నందు వల్ల తాగునీటి కుంటలకు నీరు విడుదల కోరారు. తాగునీరు విడుదల చేయకుంటే మండల పరిషత్ కార్యాలయాల ముందు ధర్నా చేస్తామని అయా గ్రామాల ప్రజలు రాముడు, మల్లికార్జున, గోకారి, లింగన్న, వెంకటరెడ్డి, రామచంద్రారెడ్డి, వెంకటేశ్వర్లు తెలిపారు.

డ్రైవింగ్ లైసెన్స్ లేకుంటే జరిమానా

సి. బెళగల్, ఏప్రిల్ 7: డ్రైవింగ్ లైసెన్స్ లేకుండ వాహనాలు నడిపితే జరిమానా తప్పదని ఎస్ఐ తిమ్మారెడ్డి వాహనదారులకు సూచించారు. ఆదివారం మండల కేంద్రంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ తిమ్మారెడ్డి మాట్లాడుతూ మండలంలోని రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ద్విచక్ర, ఆటో, ట్రాక్టర్, లారీ, మోటార్ సైకిల్ వాహనాలలో అధిక మొత్తం డబ్బులను పెట్టుకుని ప్రయాణం చేసినా, ఒక వ్యక్తి రూ 50 వేల కంటే ఎక్కువ నగదు ఉన్నా కేసు నమోదు చేస్తానని హెచ్చరించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే జరిమానా విధిస్తామన్నారు.

ఓటు ఆయుధం

ఆర్ఓ భార్గవతేజ

కర్నూలు(న్యూసిటీ), మార్చి 23: ప్రజాస్వామ్యంలో ఓటు శక్తివంతమైన సాధనమని, ఓటు హక్కు వినియోగించుకోవడం అందరి బాధ్యత అని కర్నూలు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి ఎ.భార్గవతేజ పిలుపునిచ్చారు. సార్వత్రిక ఎన్నికలు 2024లో భాగంగా మెప్మా ఆధ్వర్యంలో మంగళవారం స్వీప్ కార్యక్రమం నిర్వహించారు. ప్రకాష్‌నగర్, రోజా, రాధాకృష్ణ ఆసుపత్రి, మోడరన్ ఫంక్షన్ హాల్, అంబికా శిశుకేంద్రం, టంగుటూరు ప్రకాశం పంతులు స్మారక పాఠశాల, మదర్ థెరిసా కూడలి వరకు ఓటు హక్కు వినియోగంపై ఆర్‌పీ, సీఓలు, పొదుపు గ్రూప్ మహిళలు అవగాహన ర్యాలీ నిర్వహించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం ఓటు హక్కు వినియోగంపై అందరితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మోహన్‌కుమార్, అడిషనల్ కమిషనర్ పివి.రామలింగేశ్వర్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దారు ధనుంజయ, సోషల్ డెవలప్‌మెంట్ స్పెషలిస్టు పెంచలయ్య, ప్రత్యేక అధికారి మంజూర్‌బాషా పాల్గొన్నారు.

● ఖానా ఖజానాలో స్వీప్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా చిన్నారలు చేసిన ఆత్మరక్షణా కళల ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. అనంతరం ఓటు హక్కు వినియోగంపై అందరితో ప్రతిజ్ఞ చేయించారు.

టీడీపీ కూటమి గెలుపు చారిత్రక అవసరం

మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత



మాట్లాడుతున్న గౌరు చరిత

కల్లూరు, ఏప్రిల్ 7: రాష్ట్రంలో టీడీపీ కూటమి గెలుపు చారిత్రక అవసరమని పాణ్యం టీడీపీ అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే గౌరుచరిత అన్నారు. ఆదివారం కల్లూరు అర్బన్ 20వ వార్డు ధనలక్ష్మీనగర్‌లో ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకుని మేనిఫెస్టో పత్రాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా గౌరుచరిత మాట్లాడుతూ టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు సీఎం అయితేనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం జరుగుతుందన్నారు. ఏపికి పరిశ్రమలు రావాలన్నా, ఇంటికో ఉద్యోగం రావాలనా, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు రావాలనా టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావాలని గౌరుచరిత స్పష్టం చేశారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంకటనే కూల్చివేతలతో పాలన ప్రారంభించిన జగన్ రాష్ట్రంలో 58 నెలలుగా విధ్వంసపాలన సాగించి రాక్షసానందం పొందుతున్నాడన్నారు. వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలకు ప్రజలు విసుగెత్తి పోయారని రానున్న ఎన్నికల్లో జగన్‌కు ఓటుతో బుద్ధిచెప్పాలన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జ్ పెరుగు పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్‌యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, పెద్దబీచుపల్లి, పల్లె రఘునాథ్‌రెడ్డి, పెరుగు ధుర్గాప్రసాద్‌రెడ్డి, కట్టా వెంకటరెడ్డి, అరుణ్‌కుమార్‌రెడ్డి, మాండ్ర నరేంద్రనాథ్‌రెడ్డి, వంగాల జనార్ధన్‌రెడ్డి, సీమ ప్రసాద్‌రెడ్డి, నాయకులు విజయ్‌యాదవ్, టీచర్ జగదీస్, నాగముని, శ్రీరాములు, అయ్యస్వామి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన బొల్లవరం యువత



గౌరు దంపతుల సమక్షంలో టీడీపీలో చేరిన బొల్లవరం యువత

పాణ్యం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీలోకి వలసలు కొనసాగుతూనే ఉన్నాయి. కల్లూరు మండలం బొల్లవరం గ్రామానికి చెందిన 20 కుటుంబాలతో పాటు రిటైర్డ్ ఆర్మీ అసోసియేషన్ సభ్యులు టీడీపీలో చేరారు. ఆదివారం గౌరు స్వగృహంలో పాణ్యం టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే గౌరుచరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కండువాలు కప్పి వారిని పార్టీలోకి గౌరు దంపతులు సాదరంగా ఆహ్వానించారు.పార్టీలో చేరిన వారిలో జయకుమార్, వినోద్, విజయ్, ప్రితిక్, శేఖర్, చందు, లికిత్, శివ, మదు ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు డి.రామాంజనేయులు, పుసులూరు ప్రభాకర్‌రెడ్డి, మస్తాన్‌నాయుడు, రాజేంద్రప్రసాద్, విజయ్, మదు, బోగేశ్వరరెడ్డి, రిటైర్డ్ ఆర్మీ అషోసియోషన్ అధ్యక్షులు యు.సాధాకర్, సెక్రటరి మల్లికార్జున, రమేష్‌గౌడ్, నరేష్, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీ బీసీల పార్టీఅని టీడీపీ అధినేత చంద్రబాబుతోనే బీసీలకు సముచిత న్యాయం జరుగుతుందని పాణ్యం టీడీపీ అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే గౌరుచరిత, నంద్యాల పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి బైరెడ్డి శబరి అన్నారు. ఆదివారం కల్లూరు మండలం దూపాడు సమీపంలోని వెంకటేశ్వర ఫంక్షన్‌హాల్లో నిర్వహించిన జయహో బీసీ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈసందర్భంగా గౌరుచరిత, శబరి మాట్లాడుతూ టీడీపీలో బీసీలకు చంద్రబాబు పెద్దపీఠ వేశారని, బీసీల అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్న పార్టీ అన్నారు. రానున్న ఎన్నికల్లో బీసీలంతా ఎకమై టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డి.రామాంజనేయులు, మాజీ జెడ్పీ చైర్మన్ ఏ.వెంకటస్వామి, మాజీ ఎంపీపీ వాకిటి మాదవి, ఉలిందకొండ టీడీపీ నాయకుడు ఈవీ.రమణ, నంద్యాల బీసీ సెల్ అధ్యక్షుడు మల్లికార్జున, పెద్దబీచుపల్లి, జే.గంగాధర్‌గౌడ్, కాసాని మహేష్‌గౌడ్, శేఖర్‌చౌదరి, శ్రీరాములు, కేతురుమధు, పుసులూరు ప్రభాకర్‌రెడ్డి కరువ. ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే యాదవుల అభివృద్ధి: టీజీ



టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు



మాట్లాడుతున్న టీజీ భరత్

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 7: యాదవుల సంక్షేమం, అభివృద్ధి కోసం తెలుగుదేశం పార్టీ కృషి చేస్తుందని కర్నూలు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. ఆదివారం నగరంలోని మౌర్యఇన్ పరిణయ హాలులో కురువ సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. టీజీ భరత్ మాట్లాడుతూ టీడీపీకి మద్దతు ఇచ్చేందుకు యాదవులు ముందుకు రావడం సంతోషించదగ్గ విషయమన్నారు. ఒక్క సారి తనకు ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వాలని ఆయన కోరారు. కర్నూలులో యాదవ సంక్షేమ భవన్ నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకునేందుకు యాదవులు కలిసికట్టుగా నిర్ణయం తీసుకోవాలన్నారు. రాష్ట్రానికి చంద్రబాబు నాయకత్వం చాలా అవసరం ఉందన్నారు. టీడీపీ ప్రభుత్వం వస్తేనే మళ్లీ రాష్ట్రం గాడీలో పడుతుందని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షులు నాగరాజు యాదవ్, జనసేన ఇంచార్జీ అర్షద్, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్కీటూ గోపినాథ్ యాదవ్, విజయలక్ష్మి, యాదవ్ సంఘం జిల్లా అధ్యక్షులు ఆయ్యన్న యాదవ్, శ్రీరాములు, జెవీ క్రిష్ణయ్య, డాక్టర్ బాలమద్దయ్య, డాక్టర్ చంద్రశేఖర్, రాజుయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న టీజీ భరత్



ఇఫ్తార్ విందులో పాల్గొన్న టీజీ భరత్

కర్నూలు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి టీజీ భరత్ ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఆదివారం 46వ వార్డులోని రైల్వే స్టేషన్ వద్ద ఉన్న అమీరుద్దీన్ మసీదులో నిర్వహించిన ఇఫ్తార్ విందులో ముస్లిం మత పెద్దలకు పండ్లు తినిపించి రోజా ఉపవాస దీక్షను విరమింప చేశారు. అనంతరం వారితో కలిసి టీజీ భరత్ ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్ రజాక్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక

నగరంలోని శ్రీరామ్‌నగర్ కాలనీకు చెందిన వైసీపీని చెందిన మహిళలు, నాయకులు ఆదివారం టీజీ భరత్ సమక్షంలో టీడీపీలో చేరారు. నగరంలోని 24,25 వార్డులకు చెందిన సునీల్, ప్రవీణ్ వైసీపీని వీడి టీడీపీలో చేరారు. టీజీ భరత్ మహిళలకు కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. అనంతరం టీజీ భరత్ మాట్లాడుతూ తన కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులు పెట్టాలని చూస్తే ఎంత మాత్రం ఉరుకోనని అన్నారు. ఎలాంటి కండీషన్లు లేకుండా సునీల్, ప్రవీణ్ తన దగ్గర చేరారని తెలిపారు. కేవలం వార్డు ప్రజల కోసం స్థానిక సమస్యలు తీరిస్తే చాలని తనతో చెప్పారన్నారు. తన క్యాడర్‌పై చేయి వేస్తే.. ఎంతటి వారైనా వదలి పెట్టనన్నారు. కార్యకర్తలకు అండగా ఉంటానని టీజీ భరత్ భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నగర ఆధ్యక్షుడు నాగరాజు యాదవ్, సీనియర్ నాయకులు బషీర్, స్వామిరెడ్డి, అబ్బాస్, జనసేన నాయకులు పవన్, నాయకులు పాల్గొన్నారు.

టీడీపీలోకి వలసల వెల్లువ



టీడీపీలో చేరిన అనుగొండ వైసీపీ నాయకులు, కార్యకర్తలు



టీడీపీలో చేరిన పులకుర్తి వైసీపీ నాయకులు, కార్యకర్తలు

కర్నూలు(రూరల్)ఏప్రిల్ 7: కోడుమూరు నియోజకవర్గం టీడీపీలోకి భారీ వలసలు పెరిగాయి. ఆదివారం కర్నూలులో టీడీపీ సీనియర్ నాయకులు ఎదురూరు విష్ణువర్దన్‌రెడ్డి, కర్నూలు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు, కోడుమూరు టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి, కర్నూలు ఎంపీ డా.సంజీవకుమార్, సమక్షంలో అనుగొండ వైసీపీ శ్రేణులు టీడీపీలో చేరారు. వారికి అభ్యర్థులు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎంపీ సంజీవకుమార్ మాట్లాడుతు కర్నూలు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థితో పాటు అన్ని నియోజకవర్గాల టీడీపీ అభ్యర్థులను గెలిపించి చట్టసభలకు పంపాలని పిలుపునిచ్చారు. విష్ణువర్దన్‌రెడ్డి మాట్లాడుతు ప్రస్తుత పరిస్థితిలో టీడీపీ అధికారంలోకి రావడం చారిత్రక అవసరమన్నారు. టీడీపీలో చేరిన వారిలో వైసీపీ మండల సమన్వయ కర్త రామలింగం, వెంకటేష్, వెంకటరాముడు, చంద్ర,రామదాసు,సుంకన్న, ఆచారి,మల్లయ్య, రామగిడ్డయ్య పరమేష్, జయన్న, మధు,వెంకటరాముడు, రామాంజనేయులు, రాజశేఖర్,శివన్న, తిక్కసున్నయ్య, దాసు, వేణుగోపాల్, తదితరులు ఉన్నారు.

● కోడుమూరు మండలం పులకుర్తి గ్రామం టీడీపీ యువనాయకులు త్రివేద్ ఆధ్వర్యంలో దయ యూత్ సభ్యులు టీడీపీ సీనియర్ నాయకులు విష్ణువర్దన్‌రెడ్డిని కలిసి గజమాలతో సత్కరించారు. విష్ణును కలిసిన వారిలో సుంకన్న,రంగన్న,శ్రీను,చిన్న,ఎల్లప్ప,నాగప్ప,నరసప్ప,గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

● గూడూరు మండలం పెంచికలపాడు గ్రామానికి చెందిన టీడీపీ, జనసేన నాయకులు కర్నూలు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి బస్తిపాటి కురువ నాగరాజును మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం విష్ణువర్దన్‌రెడ్డిని కూడా కలిసి అభ్యర్థులకు సంపూర్ణ మద్దతు తెలిపారు. నాగరాజును కలిసిన వారిలో టీడీపీ కురువ సాధికారక జల్లా కన్వీనర్ వెంకటరాముడు, ఎంపీటీసీ మద్దిలేటి, కర్ణం,చిన్నగిడ్డయ్య,నాగేష్,చంద్రశేఖర్,ఓబులేష్, హరి తలారి గోపాల్, నాగసుంకన్న, గజ్జల నడిపి సుంకన్న, చిన్న సుంకన్న ఈశ్వరయ్య తదితరులు ఉన్నారు.

● కర్నూలు రూరల్ మండలం జి.శింగవరం గ్రామ వాసులు కర్నూలు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి నాగరాజును కలిశారు.

కర్నూలు(కల్చరల్): కర్నూలు రూరల్ మండలం ఇ-తాండ్రపాడుకు చెందిన సుమారు 200 మందికి పైగా సీపీఎం కార్యకర్తలు టీడీపీ కోడుమూరు మాజీ ఇన్‌చార్జి విష్ణువర్థన్‌రెడ్డి, కర్నూలు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి పంచలింగాల బస్తిపాటి నాగరాజు, కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి బొగ్గుల దస్తగిరి సమక్షంలో ఆదివారం టీడీపీలో చేరారు. టీడీపీ నాయకులు శేషన్న ఆధ్వర్యంలో సీపీఎం సీనియర్ నాయకుడు కామ్రేడ్ మునిస్వామి, తిరుమలేష్, వెంకన్న, తిరుపాల్, గరీబ్‌బాషా, టీకే వెంకటేశ్, ఎం.శేషన్న, కిషోర్, గంగన్న, సిద్దయ్యల ఆధ్వర్యంలో వచ్చిన ఆ పార్టీ కార్యకర్తలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

అభ్యర్థుల విజయానికి కృషి చేస్తాను

కర్నూలు(న్యూసిటీ), ఏప్రిల్ 7: కర్నూలు పార్లమెంటు పరిదిలో వైసీపీ అభ్యర్థుల విజయానికి తన వంతు కృషి చేస్తానని పార్టీ జిల్లా అధ్యక్షురాలు సత్యనారాయణమ్మ అన్నారు. ఇటీవల నూతనంగా జిల్లా అధ్యక్షురాలిగా ఎన్నికైన ఆమె ఆదివారం పార్టీ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ అందరిని కలుపుకుని పార్టీ కార్యాక్రమాలను ముందుకు తీసుకెళ్తామన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

ఓర్వకల్లు, ఏప్రిల్ 7: ఓర్వకల్లు ఎంపీడీవో కార్యాలయంలో ఈ నెల 8న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మల్లీశ్వరి ఆదివారం తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీపీ తిప్పన్న అధ్యక్షత వహిస్తారన్నారు. గత సమావేశంలో చర్చించిన సమావేశాలు, అంశాలపై చర్చించడం జరుగుతుందన్నారు. మండలంలోని ఆయా శాఖ అధికారులు ప్రగతి నివేదికలతో హాజరు కావాలని ఆమె కోరారు.

భవిష్యత్తు తరానికి చంద్రబాబు భరోసా



ప్రచారం కొనసాగిస్తున్న టీఎన్‌టీయూసీ నాయకుడు బడెషాగౌడ్

కోడుమూరు, ఏప్రిల్ 7: భవిష్యత్తు తరానికి చంద్రబాబునాయుడు భరోసా కాబట్టి ఎన్నికల్లో టీడీపీ గెలిపించాలని టీఎన్‌టీయూ మండల కార్యదర్శి బడెషాగౌడ్ అన్నారు. స్థానిక 20వ వార్డులో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి సూపర్ సిక్స్ పథకాల గూర్చి ప్రజలకు వివరించారు. టీడీపీ ఓటు వేసి వేయించి గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో భాగ్యమ్మ, వీరేశ్, రామేశ్వరమ్మ, సావిత్రి, లక్ష్మీదేవి, బాలకృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ముగ్గుల పోటీలు ప్రారంభం

కోడుమూరు, ఏప్రిల్ 7: ఉగాది పండుగ పురస్కరించుకొని వల్లెలాంబదేవి కమిటీ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం 8గంటలకు కామార్తి నర్సప్ప, వార్డు సభ్యులు లింగమూర్తి దాతల సహకారంతో ముగ్గుల పోటీలను చేపట్టానున్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన మహిళలకు మొదటి బహుమతిగా రూ.5వేలు, రెండవ బహుమతిగా రూ.4వేలు, మూడవ బహుమతిగా రూ.3వేల నగదును అందజేయనున్నారు.

9న జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం

కోడుమూరు: ఉగాది పర్వదినం జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్, జడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ఈ పోటీలకు ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి కబడ్డీ జట్లు రానున్నాయని చెప్పారు. పోటీల్లో గెలుపొందిన జట్టుకు మొదటి బహుమతిగా రూ.40వేల నగదును దాతలు హర్షయూత్ సభ్యులు అందజేయనున్నారు. రెండో బహుమతిగా రూ.30వేలు నగదును క్రిష్ణాపురం సర్పంచు శ్రీనివాసరెడ్డి, మూడవ బహుమతి రూ.20వేల నగదును జి.మల్లారెడ్డి, నాల్గవ బహుమతి రూ.10వేల నగదును పింజరి మస్తాన్ మస్తాన్ అందజేయనున్నారని చెప్పారు. అంతేకాకుండా ఎస్ఎన్ఆర్ హెచ్‌పీ గ్యాస్ యాజమాన్యం అద్దుగల రజని, బైరెడ్డి విధాత్రి సహకారంతో రాత్రి తాన్వితార కూచిపుడి నృత్య ప్రదర్శన అలాగే వల్లెలాంబదేవి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆకాశంలో హరివిల్లు వంటి కార్యక్రమాలు చేపట్టనున్నామని తెలిపారు.

10న పొట్టేళ్ల పందెం

కోడుమూరు: 10న పొట్టేళ్ల పందెం నిర్వహించనున్నారు. దాతలు లింగన్న, రాఘవేంద్ర, మాధులు, లింగమయ్య, శివరాముడు, పరమేష్, వెంకటేష్, విశ్వనాథ్‌రెడ్డి, హనుమంతు, శ్రీనివాసులు సహకారంతో పొట్టేళ్ల పందెం చేపట్టనున్నారు. పందెం తలపడి గెలుపొందిన పొట్టేళ్లకు మొదటి బహుమతిగా రూ.20వేలు, రెండవ బహుమతిగా రూ.15వేలు, మూడవ బహుమతిగా రూ.10వేలు, నాల్గవ బహుమతిగా రూ.5వేల నగదును అందజేయనున్నారు. ఈ పోటీలన్ని స్థానికఅపర్ణ స్టార్ నెట్‌వర్క్ ద్వారా ప్రత్యేక ప్రసారం, మిమిక్రి ఆర్టిస్ట్ ఉస్మాన్‌బాష హస్య ప్రదర్శన ఉంటుందని ఆలయ కమిటీ చైర్మన్ రఘునాథ్‌రెడ్డి తెలిపారు.

బీసీలే టీడీపీకి వెన్నెముక: టీడీపీ



మాట్లాడుతున్న గోవిందరెడ్డి

ఓర్వకల్లు, ఏప్రిల్ 7: బడుగు, బలహీన వర్గాల ప్రజలే తెలుగుదేశం పార్టీకి వెన్నముక అని టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి అన్నారు. ఆదివారం ఓర్వకల్లులో జయహో బీసీ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా నంద్యాల టీడీపీ ఉపాధ్యక్షులు మోహన్ రెడ్డి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ టీడీపీ హయాంలో ఆదరణ పథకం కింద పరికరాలను అందజేసిందన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరితను, నంద్యాల పార్లమెంటు అభ్యర్థి బైరెడ్డి శబరిని అత్యదిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, సుధాకర్ రెడ్డి, యాసీన్‌బాషా, నాగరాజు, శ్రీరాములు, రామకోటేశ్వరరావు సుధాకర్‌రావు, అల్లాబాబు, కురువ జయన్న, శ్రీనివాసులు, అబ్దుల్లా, మధుసూదన్ గౌడు పాల్గొన్నారు.

టీడీపీ విజయాన్ని ఎవ్వరూ ఆపలేరు

గూడూరు, ఏప్రిల్ 7: రాష్ట్రంలో టీడీపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ విజయాన్ని ఎవ్వరూ ఆపలేరని నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ కురుకుంద రామాంజనేయులు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గజేంద్ర గోపాల్ నాయుడు అన్నారు. ఆదివారం గూడూరు నగర పంచాయతీ పరిధిలోని ఆయా కాలనీల్లో టీడీపీ నాయకులు రామాంజనేయులు, గజేంద్ర గోపాల్ నాయుడు ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు ఇంటింటికి వెళ్ళి బాబు షూరిటీ - భవిష్యత్ గ్యారెంటి కింద సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ కౌన్సిలర్లు బుడ్డంగలి, కోడుమూరు షాషావళి, మైనార్టీ నాయకుడు మన్నన్ బాష, మండల తెలుగు యువత అధ్యక్షుడు సుమన్, కళ్యాణ్ రఘు, పౌలు, విజయ్ కుమార్, తెలుగు శ్రీను, విష్ణు సేన అభిమానులు పాల్గొన్నారు.

జియాలజిస్టుల పాత్ర కీలకం

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 7: ఖనిజ సంపద వెలికి తీయడంలో జీయాజీస్టుల పాత్ర కీలకమైందని గనుల శాఖ డిప్యూటి డైరెక్టర్ రాజశేఖర్ అన్నారు. ఆదివారం అంతర్జాతీయ జీయాలజిస్టుల దినోత్సవం గనుల శాఖ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో ఖనిజాల వెలికితీయడంతో పాటు ఎక్కడెక్కడ ఏ ఖనిజం లభ్యం అవుతుంది, వాటి ఉపయోగాలు, ప్రయోజనాలు తెలియజెప్పడంతో వారి పాత్ర కీలకమైందని కొనయాడారు.ప్రతి ఏడాదీ ఏప్రిల్ నెలలో మొదటి ఆదివారం రోజు ప్రపంచ జీయాలజీస్టు దినోత్సవం జరుపుకోవడం అభినందనీయమన్నారు. ఈకార్యక్రమంలో ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లా నుంచి వచ్చిన జీయాలజీస్టులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న చేనేత హస్తకళా ప్రదర్శనలు



చేనేత వస్తువులను కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

కర్నూలు(కల్చరల్), ఏప్రిల్ 7: నగరంలో నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని దేవీ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన శ్రీకళని చేనేత హస్తకళా ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. ఉగాది, రంజాన్ పండుగల సందర్భంగా వినియోగదారులు ఈ ప్రదర్శనల పట్ల ఆసక్తి చూపిస్తున్నారు. ఈ ప్రదర్శనల్లో పోచంపల్లి, మంగళగిరి, వెంకటగిరి, చీరాల శారీస్‌తోపాటు డ్రెస్ మెటీరియల్ ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనలు ఈనెల 12 వరకు కొనసాగుతాయని, ఉదయం పది గంటల నుంచీ రాత్రి తొమ్మిది గంటల వరకు ప్రదర్శనలు, అమ్మకాలు ఉంటాయని నిర్వాహకుడు ఎస్ హుస్సేన్ తెలిపారు.

వైద్య ఆరోగ్యశాఖలో ఆరోగ్య దినోత్సవం

కర్నూలు(హాస్పిటల్), ఏప్రిల్ 7: ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని ఆదివారం జిల్లా వైద్యఆరోగ్య శాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌వో డా.వై.ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం డీఎంహెచ్‌వో చాంబరులో ఆయన జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం, ఆరోగ్య సురక్ష కార్యక్రమాల హెల్త్ క్యాంప్ ఈ నెల 8వ తేదీ నుంచి యథావిధిగా నిర్వహించాలన్నారు. ఎన్నికల కోడ్ నియమావళి పాటించాలని, జూమ్ మీటింగ్ ద్వారా పీహెచ్‌సీ వైద్యాధికారులను ఆదేశించారు. అధిక ఉష్ణోగ్రతలు ఉన్నందు వల్ల ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

'లయన్స్ క్లబ్ సేవలు గ్రామీణ ప్రాంతాలకు విస్తరిస్తాం'

కర్నూలు(కల్చరల్), ఏప్రిల్ 7: లయన్స్ క్లబ్ సేవాలను గ్రామీణ ప్రాంతాలకు విస్తరిస్తామని లయన్స్ క్లబ్ ఆఫ్ మెల్విన్ జోన్స్ జిల్లా ప్రతినిధి డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం కడప జిల్లా ప్రొద్దుటూరులో జరిగిన 2022-23 ఏడాదికిగాను విశిష్ట సేవలు అందించిన లయన్స్ క్లబ్‌లకు అవార్డుల ప్రదానోత్సవంలో భాగంగా, ఉత్తమ సేవలు అందించినందుకు లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ ప్రతినిధి డాక్టర్ రాయపాటి శ్రీనివాస్‌కు జ్ఞాపిక ప్రదానం చేశారు.

పేద ముస్లింలను ఆదుకున్నప్పుడే నిజమైన రంజాన్


ముస్లిం మహిళలకు రంజాన్ కానుక అందిస్తున్న నూర్ అహ్మద్

ఆదోని (అగ్రికల్చర్), ఏప్రిల్ 7: పేద ముస్లింలను ఆదుకున్నప్పుడే నిజమైన రంజాన్ వేడుక చేసుకున్నట్లని సామాజిక సంఘ సంస్కర్త నూర్ అహ్మద్ అన్నారు. ఆదివారం స్థానిక హవేలీ హాలులో 250 మంది పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా కిట్లను అందజేశారు. ముఖ్య అతిథులుగా డాక్టర్ ముబీన్ అహ్మద్, సాధిక్ ఏపీయూడబ్ల్యూజే తాలుకా కార్యదర్శి మహమ్మద్ హుసేన్, న్యాయవాది హుసేన్ సాని, ఉర్దూ జర్నలిస్ట్ సిరాజ్-ఉల్-హక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసంలో సేవా కార్యక్రమాలు చేయడం అదృష్టంగా భావిస్తున్నామని పేర్కొన్నారు.

వీరశైవులకు ప్రభుత్వం చేసిందేమీ లేదు

ఆదోని టౌన్, ఏప్రిల్ 7: ఐదు సంవత్సరాల పాటు అధికారంలో ఉన్న జగన్‌రెడ్డి ప్రభుత్వం వీరశైవుల కోసం ప్రత్యేకంగా చేసింది ఏమీ లేదని టీడీపీ వీరశైవ సాధికార కమిటీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ శివరాజు, జిల్లా సభ్యుడు కన్నె జగదీష్ అన్నారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ వీరశైవులకు సంబంధించిన కోట వీరభద్ర స్వామి దేవాలయంతో పాటు పేట వీరభద్ర స్వామి దేవాలయాల అభివృద్ధి కోసం ఎలాంటి కార్యక్రమాలు చేపట్టలేదన్నారు. చాలాకాలంగా ఈ దేవాలయాలకు పాలక మండలాలను కూడా ఎంపిక చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వీరశైవుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసినా ఏ ఒక్కరికి ఇంతవరకు రుణం మంజూరు కాలేదని విమర్శించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ వీర శైవుల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. కమిటీ సభ్యులు కౌశిక్, నీలకంఠ, బద్రి, మంజునాథ్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

మద్దికెర, ఏప్రిల్ 7: ఎన్నికల్లో ప్రజలంతా వివాదలకు, ఘర్షణలకు దూరంగా ఉండి ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని సీఐ ప్రవీణ్ కుమార్ కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో అన్ని పార్టీల నాయకుల సమావేశం జరిగింది. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రజలు గుంపులు గుంపులుగా ఉండొద్దన్నారు. అన్నీ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు సహకరించాలని కోరారు. ప్రజలను రెచ్చగొట్టేలా సోషల్ మీడియాలో పోస్టులు పెడితే.. కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ డి.మురళిధర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీలు పురుషోత్తంచౌదరి, జమేదార్ రాజన్న యాదవ్, సర్పంచులు బొమ్మనపల్లి ఆంజనేయులు, విజయుడు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి : సీపీఐ

మద్దికెర, ఏప్రిల్ 7: మార్చి 31న జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఐదుగురు మహిళా కూలీల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని మండల సీపీఐ కార్యదర్శి నాగరాజు, మండల వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు కోదండరాముడు కోరారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఉపాధి పనుల్లేక కుటుంబ పోషణ కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లి ప్రాణాలు కోల్పోవడంతో ఆ కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. ప్రభుత్వం ఇంత వరకు ఆ కుటుంబాలకు ఎలాంటి భరోసా ఇవ్వలేదన్నారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఇంటి వద్దకే రూ.4 వేల పింఛన్ : టీడీపీ

మద్దికెర, ఏప్రిల్ 7: టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.4వేలు పింఛన్ ఇంటి వద్దకే వచ్చి పంపిణీ చేస్తారని టీడీపీ నాయకులు బసినేపల్లి హరినాథ్‌గౌడు, శ్రీనివాసులు, సంజప్ప అన్నారు. ఆదివారం మండలంలోని బసినేపల్లి, మదనంతపురం గ్రామంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన వెంటనే సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. తెలుగు యువత నాయకులు ఉన్నారు.

బిల్లు రాక లబ్ధిదారుడి వేదన

దేవనకొండ, ఏప్రిల్ 7 : ఇంటి నిర్మాణ బిల్లు రాక ఓ లబ్ధిదారుడు తల్లడిల్లుతున్నారు. హౌసింగ్ అధికారులు, థర్డ్‌పార్టీ (వైసీపీకి చెందిన అదే గ్రామానికి వ్యక్తి)రూ.85 వేలు బిల్లు మింగేసినట్లు లబ్ధిదారుడు నాగన్న ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. మండల పరిధిలోని నేలతలమర్రిలో నేసే నాగవేణి కి పీఎంఎవై కింద ఐడి నెంబరు 262015 ఎన్‌పీ16130448 ఇళ్లు మంజూరైంది. ఇంటి నిర్మాణ పనులను థర్డ్ పార్టీకి చెందిన వ్యక్తి నిర్మించాల్సి ఉంది. అయితే, ఆ వ్యక్తి చేతులెత్తేయడంతో విసుగు చెందిన నాగన్న సొంతంగానే ఇంటి పనులు చేసుకున్నారు. 'అప్పులు తెచ్చి ఇంటి నిర్మాణం చేశా. మంజూరైన బిల్లు నా ఖాతాలో జమ కాలేదు. ఈ విషయంపై స్పందనలో కలెక్టరుకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండా పోయింది" అంటూ బాధితుడు నాగన్న ఆవేదన వ్యక్తం చేశారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

ఎమ్మిగనూరు రూరల్, ఏప్రిల్ 7: గ్రామంలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని రూరల్ ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. ఆదివారం కందనాతి గ్రామంలో పర్యటించి గ్రామస్థులతో సమావేశాన్ని నిర్వహించారు. గ్రామంలో ప్రజలు ఐక్యంగా శాంతియుతంగా జీవించాలన్నారు. చిన్న చిన్న సమస్యలపై ఘర్షణలకు పాల్పడితే ఎంతటివారినైనా ఉపేక్షించేదిలేదన్నారు. సమస్యలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తెస్తే చట్టపరంగా విచారించి న్యాయం చేస్తామని పేర్కొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయులు

ఆస్పరి, ఏప్రిల్ 7: ఆస్పరిలోని జడ్పీ హైస్కూల్లో పదవ తరగతి చదివిన 2002-03 బ్యాచ్ విద్యార్థులంతా ఆదివారం కలిసి సందడి చేశారు. వారు చదువుకున్న తరగతి గదులకు వెళ్లి నాటి స్మృతులు గుర్తుచేసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పించిన గురువులు రామలింగారెడ్డి, వెంకటరాముడు, మాబు, రుద్రప్ప, శ్రీనివాసులు, హుసేని, శ్రీదేవి, ప్రతాప్‌లను ఘనంగా సన్మానించారు. హైదరాబాద్, బెంగళూరు వంటి సుదూర ప్రాంతాల నుంచి పూర్వ విద్యార్థులు తరలివచ్చారు. బాల్యంలో చేసిన చిలిపి చేష్టలు, మధుర జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. పూర్వ విద్యార్థులు అందరూ కలవడంతో ఆట పాటలతో అలరించారు. పూర్వ విద్యార్థులు రాఘవేంద్ర, ఉదయ్, కళ్యాణ్ కుమార్, లక్ష్మణ్, జయరాం పాల్గొన్నారు.

'జ్యూస్ ఫ్యాక్టరీ పేరుతో మా భూమిని ఆక్రమిస్తున్నారు'

పత్తికొండ, ఏప్రిల్ 7: పత్తికొండలో టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ నిర్మాణం పేరుతో వారసత్వంగా వచ్చిన వ్యవసాయ భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని హోసూరు చెందిన రైతు పగిడ్యాల రామాంజి ఆరోపించారు. తన పొలంలో చేస్తున్న పనులను ఆదివారం ఆయనతో పాటు కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు. సర్వేనెంబర్.225లో 85 సెంట్లు, 286/1ఏలో రెండెకరాల 20 సెంట్లు తనకు మూడెకరాల 5 సెంట్ల భూమి వారసత్వంగా వచ్చిందన్నారు. అయితే ఆ పొలంలో కొద్ది బాగాన్ని టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ నిర్మాణానికి వాడుకునేందుకు అధికారులు ఆదేశాలు ఇచ్చారన్నారు. అయితే ఎంత పొలం కేటాయించారు..? నష్టపరిహారం మాటేమిటో భూ యజమానిగా తనకు మాట మాత్రం తెలియజేయలేదని, దీంతో హైకోర్టు, స్థానిక కోర్టు ద్వారా పనులు చేపట్టకుండా ఉత్తర్వులు తీసుకున్నామని పేర్కొన్నారు. అయినప్పటికీ కాంట్రాక్టరు పనులు చేసేందుకు ప్రయత్నించడంతో అడ్డుకున్నామన్నారు. అధికారులను ఆశ్రయించినా తమకు న్యాయం జరగలేదని వాపోయారు.

అరాచక పాలనను అంతం చేద్దాం



సులువాయి గ్రామంలో వైసీపీ నాయకులను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న వీరభద్రగౌడ్, ఘనస్వాగతం పలుకుతున్న మొలగవల్లి గ్రామస్థులు

- విలేకరుల సమావేశంలో వీరభద్రగౌడ్ పిలుపు
- నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక మేనిఫెస్టో
- ఆస్పరి, హొళగుంద, హాలహర్వి మండలాల్లో వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరిక
- ఆర్యవైశ్య సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు రమేష్ శెట్టి ఆధ్వర్యంలో 20 కుటుంబాలు చేరిక

ఆలూరు, ఏప్రిల్ 7: జగన్ అరాచక పాలనను అంతమొందించేందుకు ప్రజలు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సంసిద్ధం కావాలని ఆలూరు టీడీపీ అభ్యర్థి వీరభద్రగౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జనసేన పార్టీ ఇన్‌చార్జి వెంకప్పతో కలిసి ఆయన మాట్లాడారు. ఉగాది తరువాత నియోజకవర్గంలోని ప్రతి మండలంలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి సమావేశం నిర్వహించి గెలుపే ధ్యేయంగా పనిచేసేందుకు సమాయత్తం కావాలని కూటమి శ్రేణులకు పిలుపునిచ్చారు. నియోజకవర్గం అభివృద్ధి కోసం మేనిఫెస్టో తయారు చేసి భవిష్యత్తు తరానికి బాటలు వేద్దామని కోరారు.

గ్రామాల్లో ఘన స్వాగతం

వీరభద్రగౌడ్‌కు గ్రామీణ జనం జననీరాజనం పలుకుతున్నారు. ఆదివారం మొలగవల్లి గ్రామంలోని శ్రీగురు బీరప్పస్వామి వారిని దర్శించుకున్నారు. అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ, వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ముందుకు సాగారు. అవ్వ, తాత.... మీ ఓటు టీడీపీకే వేయాలంటూ అభ్యర్థించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ రామ్‌నాథ్ యాదవ్, సర్పంచ్ మోహన్‌రాజ్, టీడీపీ యువనేత గిరి మల్లేష్‌గౌడ్, మండల కన్వీనర్ అశోక్ పాల్గొన్నారు.

టీడీపీలోకి భారీగా వలసలు

ఆస్పరి/హొళగుంద/ఆలూరు : ఆస్పరి మండలం జొహరాపురం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు వెంకటేష్ చౌదరి ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన గ్రామ ఉప సర్పంచ్ జనార్దన్ టీడీపీలో చేరారు. కార్యక్రమంలో ఓబులేసు, ప్రకాష్, బుజ్జన్న, మల్లికార్జున, రేగెన్న, కోటి, రాముడు పాల్గొన్నారు. అలాగే హొళగుంద మండలంలోని సులవాయ్ గ్రామంలోని వైసీపీకి చెందిన 50 కుటుంబాలు టీడీపీ పార్టీలో చేరారు. వీరికి వీరభద్రగౌడ్ పార్టీ కండువా వేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు గోవింద్ గౌడ్, మండల కన్వీనర్ తిప్పయ్య, గిరి మల్లేష్‌గౌడ్, ఎండీ ఆదాం, సులువాయి రాఘవేంద్ర పాల్గొన్నారు. అలాగే హాలహర్వి మండలం గూళ్యం గ్రామానికి చెందిన సోమిరెడ్డి, ఈరన్న, యల్లప్ప, చాకలి గుడుదయ్యతో పాటు 50 వైసీపీ కుటుంబాలు టీడీపీ అభ్యర్థి వీరభద్రగౌడ్ సమక్షంలో టీడీపీలోకి చేరారు. అలాగే కర్నూలు జిల్లా ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షులు రమేష్ శెట్టి ఆధ్వర్యంలో 20 కుటుంబాలు ముఖ్యనాయకులు వీరభద్రగౌడ్ సమక్షంలో టీడీపీలోకి చేరారు.

వైసీపీకి డిపాజిట్లు కూడా రావు



జనసేన ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న రాఘవేంద్రరెడ్డి, సాతనూరు బీసీ సభలో మాట్లాడుతున్న టీడీపీ నాయకుడు రామక్రిష్ణారెడ్డి

- టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి
- జనసైనికులంతా కలిసి సమిష్టి కృషి చేయాలి

జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బి.లక్ష్మన్న

మంత్రాలయం, ఏప్రిల్ 7: టీడీపీ, జనసేన, బీజేపీ సమిష్టిగా కలిస్తే మంత్రాలయంలో వైసీపీకి డిపాజిట్లు కూడా రావని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్.రాఘవేంద్రరెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి, ఐక్యవాల్మీకి పోరాట కమిటి రాష్ట్ర అధ్యక్షుడు, బీసీ సంక్షేమ సంఘం రాయలసీమ కన్వీనర్ బి.లక్ష్మన్న అన్నారు. ఆదివారం మండలంలోని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి నివాసం ఆవరణలో జనసేన ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవేంద్రరెడ్డి, లక్ష్మన్న మాట్లాడుతూ జనసైనికుల సేవాభావం గొప్పదని, ఎవరికి భయపడాల్సిన అవసరం లేదని, అర్ధరాత్రి తలుపులు తట్టినా మీఅందరికీ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సమావేశంలో టీడీపీ సీనియర్ నాయకులు రఘునాథరెడ్డి, రామక్రిష్ణారెడ్డి, పల్లెపాడు ముత్తురెడ్డి, కోసిగి మండల టీడీపీ కన్వీనర్ జ్ఞానేష్, రాకేష్ రెడ్డి, జనసేన నాయకులు బీవీ రవిచంద్ర, ఏసేబు, రామాంజనేయులు, హనుమేష్, వీరేష్, రాజేంద్ర, సుమిత్ర, టీడీపీ నాయకులు షఫీ, బొజ్జప్ప, కేషయ్య తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో విస్తృత ప్రచారం

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సోదరుడు రఘునాథరెడ్డి, తనయుడు రాకేష్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు మండలంలోని చెట్నహళ్లి గ్రామంలో ఇంటింటికి తిరిగి టీడీపీని గెలిపించాలని అభ్యర్థించారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే సమస్యలన్నీ తీరుతాయన్నారు. నాయకులు నగేష్, మేకల మల్లేష్, బోయ గోపాల్, నాగేంద్ర, పూజారి మల్లేష్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ : మాధవరం గ్రామంలో టీడీపీ మహిళా కార్యకర్త వడ్డె పద్మ కడుపు నొప్పితో మృతి చెందింది. విషయం తెలుసుకున్న రఘునాథరెడ్డి ఆమె భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

బీసీల సత్తా చూపుతాం

కోసిగి : త్వరలో జరిగే ఎన్నికల్లో బీసీల సత్తా ఏమిటో వైసీపీకి రుచి చూపిస్తామని మంత్రాలయం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి సోదరుడు ఎన్.రామక్రిష్ణారెడ్డి అన్నారు. ఆదివారం సాతనూరు గ్రామంలో జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున బీసీ నాయకులు పాల్గొన్నారు. టీడీపీ నాయకులు రామక్రిష్ణారెడ్డి, ముత్తురెడ్డి, రామిరెడ్డి మాట్లాడుతూ బీసీలంటే టీడీపీ అని.. టీడీపీ అంటే బీసీలు అని స్పష్టం చేశారు. మూడు సార్లు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన బాలనాగిరెడ్డి తన కుటుంబ ఆస్తులను పెంచుకోవడం మినహా మరేమీ చేయలేదని విమర్శించారు. బీసీ అయిన రాఘవేంద్రరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. టీడీపీ నాయకులు కన్వీనర్ జ్ఞానేష్, చింతలగేని నర్సారెడ్డి, ఈరేష్, కోసిగయ్య, సొట్టయ్య, రామిరెడ్డి, మహాదేవ, వెంకటేష్, రంగస్వామి, కురువ అయ్యన్న, భీమేష్ పాల్గొన్నారు. అంతకుముందు గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు.

కరెంటు బిల్లులతో అప్పులపాలు

- టీడీపీ ఎమ్మిగనూరు అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డి
- 7వ వార్డులో విస్తృత ప్రచారం
- వేముగోడు వాసులు టీడీపీలో చేరిక


మహిళతో మాట్లాడుతున్న బీవీ జయనాగేశ్వరరెడ్డి

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 7: గ్రామాల్లో కరెంట్ బిల్లులు కట్టలేక అప్పుల పాలు అవుతున్నారని టీడీపీ ఎమ్మిగనూరు అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని 19వ వార్డు ఇందిరానగర్, ఉప్పర కాలనీల లో ఆయన పర్యటించారు. టీడీపీ నాయకులు కార్యకర్తలతో కలసి కాలనీలో ఇంటింటికీ వెళ్లి మహిళలను, వృద్ధులను ఆప్యాయంగా పలకరిస్తు ఓటును అభ్యర్థించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల సమస్యలు తీరాలంటే టీడీపీ అధికారంలోకి రావాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ సార్వత్రిక ఎన్నికలు కురుక్షేత్ర యుద్ధాన్ని తలపిస్తున్నాయని, అందులో ధర్మం టీడీపీ పక్షం ఉంటుందని, టీడీపీదే విజయమని పేర్కొన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఏడాదికి మూడు సిలిండర్‌లు ఉచితంగా ఇస్తామన్నారు. మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణం, 18 ఏళ్ల దాటిన మహిళలకు నెలకు రూ. 1500, నిరుద్యోగులకు నెలకు రూ. 3000 ప్రతి గ్రామానికి తాగునీరు, రోడ్ల సమస్య లేకుండా చూస్తామని పేర్కొన్నారు. వార్డు నాయకులు భాస్కర్, ఎరుకల పరమేష్, కౌన్సిలర్స్ దయసాగర్, రామదాసుగౌడ్, మిఠాయి నరసింహులు, రామకృష్ణనాయుడు, రంగస్వామిగౌడ్, చేనేత మల్లి, కలిముల్లా, తురగల్ నజీర్ పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక: గోనెగండ్ల మండల పరిధిలోని వేముగోడు గ్రామవాసులు డిడ్డికాటి కుటుంబసభ్యులు టీచర్ చిన్న అంపన్న, భాస్కర్, జనార్దన్, మాదన్న చిన్న హనుమంతు, నాయుడు భద్రి, శ్రీనివాసులు, అంపన్న, శేఖర్,పెద్దయ్య, వేంకటేశ్వర్లు, దస్తగిరి, పాండురంగడు, భాస్కర్, రవి, తో పాటు వారి అనుచరులు సుమారు 100 కుటుంబాలు టీడీపీలో చేరారు. బీవీ జయనాగేశ్వరరెడ్డి వారికి పార్టీ కండువా కప్పి సాధరంగా పార్టీ లోకి ఆహ్వానించారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు నరసింహులు, గుటుపల్లి స్వామి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ ఒత్తిళ్లతోనే అక్రమ కేసులు : ఎమ్మార్పీఎస్

పత్తికొండ టౌన్, ఏప్రిల్ 7: ఆర్‌అండ్‌బీ గెస్టు హౌస్‌లో కరపత్రాలు విడుదల చేస్తే రాజకీయ ఒత్తిళ్లతో తమపైన అక్రమ కేసులు బనాయించడం ఎంతవరకు సమంజసమని ఎమ్మార్పీఎస్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొందిమడుగుల రమేష్ మాదిగ అన్నారు. ఆదివారం ఎమ్మార్పీఎస్ఎస్ బృందం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐని కలిసి తమపై అక్రమకేసులు పెట్టడం తగదన్నారు. అక్రమ కేసులు పెట్టించిన ఆర్‌అండ్‌బీ అధికారులపై కూడా కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని సీఐకి వారు ఫిర్యాదు చేశారు.కేవలం రాజకీయ కక్షతోనే ఆర్‌అండ్‌బీ అధికారులు అడ్డు పెట్టుకుని నాయకులు తనపైన అక్రమ కేసులు బనాయించారనీ ఆగ్రహం వ్యక్తం చేశారు.

గ్రాసంపై కర్ణాటక ఆంక్షలు

- సరిహద్దుల్లో అడ్డుకుంటున్న పోలీసులు
- పైసలు ఇవ్వనిదే బండ్లను కదలనివ్వని వైనం




పశుగ్రాసం తెస్తున్న ట్రాక్టర్‌ను నిలబెట్టిన కర్ణాటక చెక్‌పోస్టు అధికారులు

ఆదోని, ఏప్రిల్ 7: జిల్లాలో ఈ ఏడాది సరైన వర్షాలు లేవు. పంటలు పండక మొలక దశలో ఎండిపోయాయి. కనీసం పశువులకు గ్రాసం కూడా కరువైంది. ఎండతీవ్రత పెరగడంతో పశ్చిమ ప్రాంత పల్లెల్లో పశువులకు గ్రాసం కోసం వెళ్లి అవస్థలు పడుతున్నారు. కర్ణాటక నుంచి మన ప్రాంత రైతులకు పశుగ్రాసం ఇవ్వకుండా కర్ణాటక ప్రభుత్వం ఆంక్షలు విధించింది. ఆదోని, ఆలూరు, హాలహర్వి, మంత్రాలయం, ఎమ్మిగనూరు, పత్తికొండ, ఆస్పరి, కోసిగి, పెద్దకడుబూరు, కౌతాళం ప్రాంతాలకు చెందిన రైతులు కర్ణాటకలోని శిరుగుప్ప, సింధనూరు ప్రాంతానికి పశుగ్రాసం కోసం ట్రాక్టర్లను తీసుకెళ్తున్నారు. అక్కడ కొంతమంది రైతులతో మన ప్రాంతానికి చెందిన రైతులు వరిగడ్డిని రూ.15వేలు నుంచి రూ.18వేల వరకు ట్రాక్టర్ గడ్డని కొనుగోలు చేస్తున్నారు. అష్టకష్టాలు పడి ట్రాక్టర్ గడ్డిని తీసుకొని సరిహద్దు ప్రాంతమైన ఇటిక్యాల చెక్‌పోస్టు వద్దకు వస్తే... అక్కడ చెక్‌పోస్టులోని కర్ణాటక పోలీసులు అడ్డుకొని రైతులను వరిగడ్డిని ఆంధ్రకు తీసుకెళ్లవద్దని వెనక్కి పంపుతున్నారు. ఆ ప్రాంత రైతులకే పశుగ్రాసం అవసరమని నిబంధనలు విధించినట్లు పోలీసులు చెబుతున్నారు. కర్ణాటక పోలీసులు, ప్రభుత్వ తీరుపై మన ప్రాంత రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పశుగ్రాసం పై ఆంక్షలు విధించడం మంచిది కాదని, ఇలాంటి నిబంధనలను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు ఇటిక్యాల చెక్‌పోస్టులోని కొందరు కర్ణాటక పోలీసులు చేతులు తడిపితే వదిలేస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.1,000 నుంచి రూ.1,500 చొప్పున మామూలు తీసుకుంటున్నట్లు రైతులు చెబుతున్నారు. పశువులు తినే గడ్డి పై కూడా నిబంధనలు విధించడంపై రైతులు మండిపడుతున్నారు.

రూ.వెయ్యి ఇస్తేనే వదులుతున్నారు

కర్ణాటక రాష్ట్రంలోని సుదూర ప్రాంతాలకు వెళ్లి పశుగ్రాసం కొనుగోలు చేసుకొని వ్యయప్రసాలు కోర్చి పశువులకు గ్రాసం తీసుకెళ్తుంటే, ఇటిక్యాల గ్రామం చెక్‌పోస్టు దగ్గర ఉన్న కర్ణాటక పోలీసులు ట్రాక్టర్‌కు రూ.1000 ఇవ్వాల్సిందేనని, లేదంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తున్నారు. కర్ణాటక నుంచి తీసుకెళ్లరాదని ఆర్డర్లు కూడా ఉన్నాయంటూ పోలీసులు బెదిరిస్తున్నారు.

\- నారాయణ రెడ్డి, చిన్నపెండేకల్లు గ్రామం, ఆదోని మండలం

కూటమి అభ్యర్థి విజయం తథ్యం


డాక్టర్ పార్థసారథితో కలిసి ప్రచారం చేస్తున్న మీనాక్షి నాయుడు

ఆదోని టౌన్, ఏప్రిల్ 7: సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థి డాక్టర్ పార్థసారధి విజయానికి ఐక్యంగా పనిచేస్తే విజయం తథ్యమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మీనాక్షినాయుడు అన్నారు. ఆదివారం రాత్రి కూటమి అభ్యర్థి డాక్టర్ పార్థసారధి ఆంజనేయస్వామి దేవాలయంలో పూజలు నిర్వహించి బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులతో కలిసి ప్రధాన వీధులలో ఇంటింటి ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా పార్థసారధి మాట్లాడుతూ తనకు ఒక్క అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని నందనవనంగా తీర్చి దిద్దుతానని అన్నారు. కేంద్రంలో మోదీ , రాష్ట్రంలో బాబు ప్రభుత్వాలే రానున్నాయని, కేంద్ర రాష్ట్ర నిధులతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపుతామని పేర్కొన్నారు. పాదయాత్రలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ, అసెంబ్లీ కో-కన్వీనర్ నాగరాజ్ గౌడ్, సాయి, ఉపేంద్ర, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మీనాక్షినాయుడ, సీనియర్ నాయకులు ఏసీ శ్రీకాంత్ రెడ్డి, మాన్వి దేవేంద్రప్ప, గుడిసె కృష్ణమ్మ, బుద్దారెడ్డి, గుడిసె శ్రీరాములు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

మంత్రాలయంలో కిక్కిరిసిన భక్తులు


మంత్రాలయం మంఠం ప్రాగంణంలో రద్దీగా ఉన్న భక్తులు

మంత్రాలయం, ఏప్రిల్ 7 : రాఘవేంద్ర స్వామి దర్శనార్థం భక్తులతో పుణ్యక్షేత్రం కిక్కిరిసింది. ఆదివారం సెలవు దినం కావటంతో వేలాది మంది భక్తులు తరలివచ్చారు. మఠం ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, నదితీరం భక్తులతో కోలాహలంగా మారింది. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. క్యూలైన్స్లు, పరిమళప్రసాదం వద్ద భక్తుల సందడిగా మారింది. భక్తుల రద్దీ పెరగడంతో లాడ్జీలు, హోటళ్లు, పూజా సామాగ్రికి డిమాండ్ పెరిగింది.

రాఘవేంద్రుని సన్నిధిలో కర్ణాటక హైకోర్టు జడ్జి

మంత్రాలయం, ఏప్రిల్ 7 : కర్ణాటక రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ రాజేంద్ర బధామికర్ ఆదివారం రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. శనివారం రాత్రి మంత్రాలయంలో బస చేశారు. ఈయనకు మహాముఖ ద్వారం వద్ద మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్ కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహమూర్తి ఘనంగా స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు జ్ఞాపిక, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. వీరి వెంట ఏఎస్ఐ ఆనందరెడ్డి, బిందు మాధవ్, అనంతస్వామి, ప్రకాశ్ ఆచార్, భీమ్‌సేన్ ఆచార్, పవన్‌ఆచార్, వ్యాసరాజార్, జయతీర్థ ఆచార్, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

దళితుల హక్కుల కోసం పోరాటం

మంత్రాలయం, ఏప్రిల్ 7: దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేస్తూ హక్కుల పరిరక్షణకు కృషి చేస్తున్నట్లు నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రామతీర్థం అమ్రేష్ అన్నారు. ఆదివారం మండలంలోని సుంకేశ్వరి గ్రామంలో గౌరవ సలహాదారుడు బాలస్వామి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో దళితుల సమస్యలపై మాట్లాడారు. నియోజకవర్గంలో అంబేడ్కర్ భావాలను, సిద్ధాంతాలను ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. దళిత కాలనీల్లో తాగునీరు, సీసీ రోడ్లు, డ్రైనేజీ, వీధిలైట్లు, పరిశుభ్రత, వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఈ నెల 14న అంబేడ్కర్ జయంతిని వైభవంగా నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించాలని కోరారు. జిల్లా కోఆర్డినేటర్ సుమాల చార్లెస్, ప్రసన్న కుమార్, అడ్వకేట్ కిషోర్, డాక్టర్ దేవ పాల్గొన్నారు.

అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయండి



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 7: భారతరాజ్యాంగ నిర్మాత డా బీఆర్ అంబేడ్కర్ 133వ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని ఉత్సవకమిటి కన్వీనర్ ఎస్ దేవసహాయం, ఛైర్మన్ మాల ఉసేనిలు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని కేవీపీఎస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో అంబేడ్కర్ జయంతి ఉత్సవ కరపత్రాలను వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితుల ఐక్యతను ప్రదర్శిస్తూ ఏప్రిల్ 14న ఆదివారం ఎమ్మిగనూరు పట్టణంలోని ఎంబీ చర్చి ఆదిఆంధ్ర పాఠశాల దగ్గరనుంచి సభాస్థలి మాచాని సోమప్ప మెమోరియల్ హాల్ వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉత్సవాల్లో ప్రజలు, యువకులు, మహిళలు, రైతులు, విద్యార్థులు, వేదావులు, ఆయా సామాజిక వర్గాలు పెద్దఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కదిరికోట ఆదెన్న, ఆనంద్, ఆనందరావు, పెద్దయ్య, కనకవీడు రాజు, రాజా ఆర్ప్ ఉసేని, రాజు, ప్రసాద్, ఏసేపు, మాలరాజు, పురుషోత్తంలు పాల్గొన్నారు.

12న పెద్దమ్మవ్వ గుడి ప్రతిష్ఠ

తుగ్గలి, ఏప్రిల్ 7: పెద్దమ్మవ్వ గుడి ప్రారంభోత్సవ వేడుకలు ఈ నెల 10 నుంచి ప్రారంభం అవుతాయని ఆలయ నిర్వాహకులు, గ్రామ పెద్దలు తెలిపారు. నల్లగుండ్లలో వారు మాట్లాడుతూ 10వ తేదీన గణపతిపూజ, గంగపూజతో ప్రారంభమవుతాయని, 11న నవగ్రహ పూజ, దుర్గా హోమాలు చేపట్టి విగ్రహాలను వీధుల గుండా ఊరేగింపు నిర్వహిస్తారని తెలిపారు. 12న పెద్దమ్మవ్వ విగ్రహ ప్రతిష్ఠతో పాటు దేవాలయ ప్రారంభోత్సవ వేడుకలు నిర్వహిస్తామని తెలిపారు.